ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





కార్తీక దీపాలు

కార్తీక సోమవారం సందర్భంగా శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆ పనులు ఆగింది అందుకేనా?

విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రెండేళ్ల క్రితం గ్రీన్‌సిగ్నల్

- రూ.456 కోట్లు మంజూరు
- ఇప్పటికి ఇద్దరు కాంట్రాక్టర్లు మార్పు
- రకరకాల కారణాలు ప్రచారం
- ప్రస్తుతం టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాని వైనం
- డీఆర్ఎం లంచం తీసుకుంటూ పట్టుబడిన నేపథ్యంలో కమీషన్లు ఇచ్చుకోలేకే కాంట్రాక్టర్లు ముందుకువచ్చి ఉండరనే ఊహాగానాలు



నిలిచిన స్టేషన్ అభివృద్ధి పనులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను రూ.456 కోట్లతో అభివృద్ధి చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయించారు. కేంద్రం అమృత్ భారత్ పథకం కింద నిధులు మంజూరుచేసింది. టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగించారు. ఆరు నెలలకే పనులు సరిగ్గా చేయడం లేదని ఆ కాంట్రాక్టర్‌ను తొలగించారు. ఆ తరువాత మరో కాంట్రాక్టర్ వచ్చారు. ఆ సంస్థ కూడా ఆరు నెలలు తిరగకుండానే వెళ్లిపోయింది. ఇప్పుడు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురావడం లేదు. వాల్తేరు డివిజన్ అధికారులు కమీషన్ల కోసం వేధించడం, బిల్లులు మంజూరు చేయడానికి భారీగా లంచాలు కోరడం వల్లే కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.3.17 కోట్ల విలువైన బిల్లులు మంజూరుచేయడానికి, పనుల్లో ఆలస్యం జరిగినందుకు విధించిన జరిమానా తగ్గించడానికి లంచం డిమాండ్ చేసి, ఆ మొత్తంలో రూ.25 లక్షలు తీసుకుంటూ తాజాగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముంబైలో సీబీఐకి దొరికిపోయారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లను కూడా ఇలాగే లంచాల కోసం వేధించి ఉంటారని, అందుకే ఎవరూ ముందుకురావడం లేదనే వాదన గట్టిగా వినిపిస్తోంది.

20 నెలల క్రితమే పనుల ప్రారంభం

విశాఖ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను 20 నెలల క్రితం ప్రారంభించారు. స్టేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా, జ్ఞానాపురం వైపు 9, 10 ప్లాట్‌ఫారాలు కొత్తగా నిర్మించాలని ప్రతిపాదించారు. అలాగే స్టేషన్‌లో కొత్తగా 20 లిఫ్టులు, 20 ఎస్కలేటర్లు పెడతామని ప్రకటించారు. ఇటు వైపు, అటు వైపు రెండు మల్టీ లెవెల్ కారు పార్కింగ్ సేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చేసి, ప్రయాణికులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. దీనికి సంబంధించి టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశారు. అందుకు వీలుగా జ్ఞానాపురం వైపు చెట్లను తొలగించారు. స్టేషన్ లోపలకు రాకపోకలు సాగించే నాలుగో నంబరు గేటును మూసేశారు. అయితే కాంట్రాక్టర్‌తో ఏ తగాదా వచ్చిందో తెలియదు గానీ ఆరు నెలలకే పనులు ఆగిపోయాయి. ఆ సంస్థ వెళ్లిపోయింది. అక్కడ మట్టి లూజుగా ఉందని, నిర్మాణాలు చేపట్టడం కష్టమని వాదన తెరపైకి తెచ్చారు. ఇది జరిగిన తరువాత మరో కాంట్రాక్టర్‌ను తీసుకువచ్చారు. వారు కూడా ఆరు నెలల్లోనే వెళ్లిపోయారు. వారు ఇటువైపు పనులు ప్రారంభించగా, కింద మొత్తం రాయి తగిలిందని, మిషన్లతో కట్ చేసుకుంటూ వెళ్లాలని, అందుకని ఆ పని చేయలేమని వెళ్లిపోయినట్టు చెబుతున్నారు. ఆ తరువాత ఇంకే కాంట్రాక్టర్ ముందుకు రాలేదు.

భారీ జరిమానాలతో బెదిరింపులు

రైల్వేలో అన్ని

... మిగతా 6వ పేజీలో

ఆస్తి పన్ను బకాయిలు 1,033.9 కోట్లు

జాబితాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నుతోపాటు వసూలు కావలసిన మొత్తం రూ.1423.93 కోట్లు
- ఇప్పటివరకూ వచ్చింది రూ.242.85 కోట్లు మాత్రమే
- మొండి బకాయిల వసూలుకు జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు బకాయిలు భారీగా పేరుకు పోతున్నాయి. కొంత మంది ప్రైవేటు వ్యక్తులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సంస్థలు కొన్ని సక్రమంగా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకపోవడంతో రూ.కోట్లలో మొండి బకాయిలు ఉండిపోయాయి. వీటిని వసూలు చేసేందుకు జీవీఎంసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రెవెన్యూ విభాగం అధికారులు ప్రత్యక్షంగా బకాయిదారులను కలిసి చర్చలు జరపాలని నిర్ణయించారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 6,13,197 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో ప్రైవేటు వ్యక్తులకు చెందినవి 5,72,002 కాగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవి 1,623, కేంద్ర ప్రభుత్వానికి చెందినవి 518 ఉన్నాయి. ఖాళీ స్థలాల పన్నుకు సంబంధించిన అసెస్‌మెంట్‌లు 38,154 ఉండగా, అందులో 600 అసెస్‌మెంట్లపై కోర్టులో కేసులు ఉన్నాయి. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ద్వారా జీవీఎంసీకి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1423.9 కోట్లు వసూలు కావాల్సి ఉంది. దీనిలో రూ.390 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించినది కాగా మిగిలిన మొత్తం (రూ.1,033.9 కోట్లు) మొండి బకాయిలు. అయితే ఈ ఏడాది ఇప్పటివరకూ రూ.242.85 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అందులో ప్రైవేటు అసెస్‌మెంట్ల నుంచి రూ.202. 37 కోట్లు రాగా, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ.11.49 కోట్లు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ.1.52 కోట్లు, కోర్టులో కేసులు ఉన్న అసెస్‌మెంట్ల నుంచి రూ.2.77 కోట్లు, ఖాళీ స్థలాల పన్ను రూపంలో రూ.24.7 కోట్లు వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఏడు సంస్థలు ఏకంగా రూ.451 కోట్లు బకాయి ఉన్నాయి. ఈ మొత్తాన్ని చెల్లించాలంటూ జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది ఎన్నిసార్లు తిరిగినా సరైన స్పందన ఉండడం లేదు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన పన్నును మాత్రమే వసూలు చేయగలుగుతున్నారు. స్టీల్‌ప్లాంటు నుంచి రూ.747.48 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, అందులో రూ.722 కోట్లు పాత బకాయి. అలాగే వీఎస్ఈజెడ్ నుంచి రూ.18.53 కోట్లు, ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి రూ.8.52 కోట్లు, గంగవరం పోర్టు నుంచి రూ.95 లక్షలు, పోర్టు క్వార్టర్స్ నుంచి రూ.59 లక్షలు, ఆదాయ పన్ను శాఖ నుంచి రూ.80 లక్షలు, వైజాగ్ పోర్టు నుంచి రూ.ఐదు లక్షలు వసూలు కావాల్సి ఉంది.

అలాగే ప్రైవేటు అసెస్‌మెంట్‌ల విషయానికి వస్తే మొత్తం 9,437 అసెస్‌మెంట్ల నుంచి రూ.38.4 కోట్లు

... మిగతా 6వ పేజీలో

అత్యధిక బకాయి ఉన్న ఆరు కేంద్ర ప్రభుత్వ సంస్థలు

1. స్టీల్‌ప్లాంటు	రూ.722 కోట్లు
2. వీఎస్ఈజెడ్	రూ.18.53 కోట్లు
3. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే	రూ.8.52 కోట్లు
4. గంగవరం పోర్టు	రూ.95 లక్షలు
5. పోర్టు క్వార్టర్స్	రూ.59 లక్షలు
6. ఆదాయపన్నుశాఖ	రూ.80 లక్షలు



జీవీఎంసీ పరిధిలో ఉన్న అసెస్‌మెంట్‌లు

రంగం	అసెస్‌మెంట్‌లు	డిమాండ్	వసూలైనది (కోట్లలో)
ప్రైవేటు	5,72,002	రూ.390.97	రూ.202.37
రాష్ట్రప్రభుత్వం	1,623	రూ.71.05	రూ.11.49
కేంద్రప్రభుత్వం	518	358.32	1.52
కోర్టు కేసులు	600	218.17	2.77
ఖాళీ స్థలాలు	38,454	385.37	24.7
మొత్తం	6,13,197	రూ.1423.9	రూ.242.85

జగనన్న కాలనీల్లో భారీ కుంభకోణం

- సీబీసీఐడీతో విచారణ చేయించాలి
- అసెంబ్లీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి



విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో భారీ దోపిడీ జరిగిందని, దీనిపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అసెంబ్లీలో డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలపై తాను అడిగిన ప్రశ్నకు మంత్రి ఇచ్చిన సమాధానం సరిగ్గా లేదని, అధికారులు తప్పుడు వివరాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. విశాఖ జిల్లాలో నగరానికి 50 కి.మీ. దూరంలో పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కొండవాలు ప్రాంతాల్లో ఈ కాలనీలు ఏర్పాటుచేశారని, వర్షం పడితే అవన్నీ నీట మునిగిపోతున్నాయన్నారు. లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేలు రుణం ఇప్పించామని చెప్పారని, అంతా అవాస్తవమని, విశాఖలో లబ్ధిదారులే ఆ సొమ్ము కట్టారన్నారు. విశాఖ జిల్లాలో 1.1 4లక్షల ఇళ్లకు కేవలం అతి తక్కువ సంఖ్యలో పునాదులు వేశారని, కానీ లెక్కలు మాత్రం భారీగా చూపిస్తున్నారని విమర్శించారు. లేఅవుట్ల

... మిగతా 6వ పేజీలో

కార్పొరేటరా మజాకా!?

రెసిడెన్షియల్‌కు ప్లాన్ తీసుకుని వాణిజ్య భవన నిర్మాణం

- పాఠశాల ఏర్పాటుకు సర్వం సిద్ధం
- విద్యా శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పెండింగ్
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు
- స్థలంపైనా వివాదం
- వైసీపీ ప్రభుత్వ హయాంలో 22ఏ నుంచి తొలగింపు
- ప్రస్తుతం కోర్టులో ఉన్న వివాదం
- వైసీపీ కార్పొరేటర్ భర్త లీలలివి...



కృష్ణాకాలేజీ వెనుక కార్పొరేటర్ నిర్మించిన అక్రమ భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)


అతడో వైసీపీ కార్పొరేటర్ భర్త. కానీ తానే కార్పొరేటర్‌గా చలామణీ అవుతుంటారు. రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా (22ఏ) ఉన్న 830 గజాల భూమిని వైసీపీ హయాంలో తన పరం చేసుకున్నారు. రెండు వేర్వేరు భవనాల నిర్మాణానికి (రెసిడెన్షియల్) జీవీఎంసీ నుంచి ప్లాన్ తీసుకున్నారు. ఒక భవనాన్ని వాణిజ్య అవసరాలకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనంలో పాఠశాల ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులకు అనేక ఫిర్యాదులు అందినప్పటికీ కార్పొరేటర్ భర్త కావడంతో చర్యలకు సాహసించలేకపోతున్నారు.

జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కాలేజీ వెనుక 830 గజాల్లో నిర్మించిన మరో వార్డు కార్పొరేటర్, ఆమె భర్త భారీ భవన నిర్మాణం వివాదాస్పదమవుతోంది. టౌన్ సర్వేనంబరు 49/4లో 415 చదరపు గజాల స్థలంలో నివాసయోగ్యమైన జీ+3 భవన నిర్మాణం, దానికి ఆనుకున్న ఉన్న మరో 415 చదరపు గజాల్లో నివాసానికి జీ+3 భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలంటూ కార్పొరేటర్ పేరుతో ఒక దరఖాస్తు, కార్పొరేటర్ భర్త పేరుతో మరొక దరఖాస్తు అందాయి. జీవీఎంసీ జారీచేసిన ప్లాన్ ప్రకారం రెండు వేర్వేరు భవనాలను నిర్మించాల్సి ఉంది. ప్లాన్‌లో నిర్దేశించిన ప్రకారం భవనాల చుట్టూ సెట్ బ్యాక్స్ విడిచిపెట్టాలి. కానీ 20 అడుగులు కూడా లేని రోడ్డులో రెండు ప్లాన్‌లను కలిపేసి ఒకే భవనం నిర్మించేశారు. నివాసానికి యోగ్యంగా భవన నిర్మాణం చేపట్టాల్సి ఉన్నప్పటికీ, వాణిజ్య అవసరాలకు అనువుగా తీర్చిదిద్దారు. రెండు భవనాలకు వేర్వేరుగా కాకుండా ఒకే మెట్లు నిర్మించారు. పైగా భవనాలకు సెట్‌బ్యాక్‌లను విడిచిపెట్టలేదు. నిర్మాణం చేపట్టిన స్థలం గతంలో ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డు నమోదై ఉండేది. వైసీపీ అధికారంలో ఉండగా ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా పనిచేసిన ముఖ్య నేత ద్వారా రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి 22ఏ జాబితా నుంచి తొలగించేశారు. దీనిపై కొందరు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాడు అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ కావడంతో చర్యలకు వెనకడుగువేశారు. 22ఏ నుంచి తొలగించిన వెంటనే భవన నిర్మాణానికి ఆగమేఘాలపై జీవీఎంసీ అధికారులు ప్లాన్ జారీచేసేశారు. ఆ స్థలానికి వీఎల్‌టీ చెల్లించాల్సి ఉందని కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో జీవీఎంసీ అధికారులు వీఎల్‌టీ చెల్లించాలంటూ కార్పొరేటర్ భర్తపై ఒత్తిడి తెచ్చారు. ఆ తర్వాత

... మిగతా 6వ పేజీలో

రుషికొండ బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి?

- సాధ్యాసాధ్యాలు పరిశీలించిన నిర్వాహకులు, నిపుణులు



సాగర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):

రుషికొండ బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను సోమవారం నిర్వాహకులు, నిపుణులు పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్కే బీచ్‌లో సబ్‌మెరైన్ సమీపాన అట్టహాసంగా ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి అలల తాకిడికి ముక్కలైన విషయం తెలిసిందే. అక్కడ నిర్వహించడం సాధ్యం కాదని గుర్తించి అధికారులు తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఈసారి రుషికొండ బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. ఆర్కే బీచ్‌లో విఫలం కావడంతో నిర్వాహకులు ఈసారి అత్యంత గోప్యంగా రుషికొండ బీచ్‌ను సందర్శించారు. బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. కాగా, రుషికొండ బీచ్‌లో ఇప్పటికే ఏపీటీడీసీ, ప్రైవేట్ సంస్థలు బోటుషికార్, కయాకింగ్, స్కూబా డ్రైవింగ్ వంటివి నిర్వహిస్తున్నాయి.

ఆశాల ఆందోళన

గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు



సిరిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) గతంలో తమకు ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు సోమవారం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన జీవోలను ఇంతవరకూ విడుదల చేయలేదన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, రిటైర్‌మెంట్ ప్రయోజనాల అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, బృంద బీమా ఊసే లేదన్నారు. ఒప్పందం అమలు కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టామన్నారు. అలాగే కనీస వేతనాలు అమలుచేస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్, యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కార్మిక సంఘ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, బొడ్డు పైడిరాజు, గణపతిరెడ్డి సంఘీభావం

ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రధాని ప్రకటించాలి

- కార్మిక సంఘ నాయకుల డిమాండ్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట్నం పర్యటనలో ప్రకటించాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశానికి అన్ని సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఈ నెలాఖరున అచ్యుతాపురం మండలం

... మిగతా 6వ పేజీలో



కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు పుష్పమాలకలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తముగా కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, మంగళనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



విరిగిపోయి ఒకవైపు వాలి ఉన్న స్తంభం

ఆనందపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిపికళ్లాలకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభం విరిగి ఒకవైపునకు వాలిపోయింది. ఆనందపురం జాతీయ రహదారి నుంచి కూతవేటు దూరంలో ఈ స్తంభం ఉంది. ఇటీవల రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం స్తంభాన్ని ఢీకొనడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇదే స్తంభంపై 11 కేవీ లైన్‌తో పాటు సుమారు వంద ఇళ్లకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.అధికారులు తక్షణమే స్పందించి స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'

ఆనందపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సరిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం వెల్లంకి గ్రామంలో ఉన్న పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ కమిటీల నియామకం వేగవంతం చేయాలన్నారు. 57 పోలింగ్ బూత్‌ల్లో, 13 శక్తి కేంద్రాల్లో కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, నాయకులు కృష్ణారావు, జీవన్, సంతోష్, బోర శ్రీను పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌తో దళితుల అభ్యున్నతి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ పథకం వల్ల దళితులకు, మైనారిటీలకు ప్రయోజనం కలుగుతోందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు అన్నారు. ఆదివారం తాళ్లవలసలో జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వికసిత్ భారత్ ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకంపై నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏటుకూరి వెంకట చైతన్య వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బొట్ట అప్పలనారాయణ, ఎం. జగదీశ్వరి, జి.రామ్‌కుమార్, గురబిల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కథల రచనపై అవగాహన

భీమునిపట్నం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు కథలు రాయడంపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మత్స్యకార ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మహేశ్వరరావు, సత్యనారాయణ, అశోక్, గ్రంథాలయాధికారి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

కొమ్మాది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే అభివృద్ధి పరుగులు పెడుతుందని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. సోమవారం ఆమె కొండవాలు ప్రాంతమైన సాయిరాం కాలనీలో మెట్లు, రోడ్లు, కాలువల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఇంటి పన్ను లేకపోవడంతో వ్యక్తిగత కుళాయిలు వేయడం లేదని ఫిర్యాదు చేయగా వెంటనే ఆమె విషయాన్ని జడ్పీ సింహాచలం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జడ్పీ నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



తగరపువలసలో గోస్తనీ నదిపై ఉన్న వంతెనలు



ఇటీవల జరిగిన కారు ప్రమాదం తరువాత వంతెన వద్ద అడ్డుపెట్టిన దిమ్మలు

రెప్ప పడిందా.. ప్రాణాలు గోవిందా..

- ప్రమాదకరంగా తగరపువలస వద్ద గోస్తనీ వంతెన
- ఇరువైపులా కానరాని లైట్లు
- శిథిలావస్థలో రక్షణ గోడలు, రెయిలింగ్
- ప్రమాదాల బారిన వాహనదారులు

తగరపువలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస సమీపంలోని గోస్తనీ నదిపై ఉన్న వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. వంతెన ఉన్న జాతీయ రహదారి గతుకులమయం కావడం, రక్షణ గోడలు, రెయిలింగ్ శిథిలావస్థలో ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కారు రెయిలింగ్‌ను దాటుకుని నదిలో పడిపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. గతంలో నదిపై ఒక వంతెన మాత్రమే ఉండేది. ట్రాఫిక్ పెరగడంతో జాతీయ రహదారి విస్తరణ అధికారులు ఆ వంతెన పక్కనే మరో వంతెన నిర్మించారు.ప్రస్తుతం ఒన్ వే ట్రాఫిక్ పద్ధతిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే వంతెనపై ఉన్న రోడ్డు గుంతలతో ఉండడం, ఇరువైపులా లైట్లు ఏర్పాటు చేయ కపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన ప్రారంభంలో పోలీసు ఔటు పోస్టు ఏర్పాటు చేశారు. ..కానీ వంతెనపై లైట్లు వేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. జీవీఎంసీ అధికారులు లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా వంతెనలో కొంతభాగం రూరల్ పరిధిలో ఉండడం వల్ల వేయడం లేదని తెలిసింది. అధికారులు స్పందించి వంతెన వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వంతెనపై శిథిలమైన సిమెంట్ పలకలు



ఎండాడ : ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు



మానంఆంజనేయనగర్‌లో శివ లింగానికి క్షీరాభిషేకం



సింహాచలం : అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో మార్మోగిన శివనామ స్మరణ

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని నియోజకవర్గంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఒకే విధమైన రద్దీ కొనసాగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భీమిలి పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, నేరేళ్లవలస పురాతన శివాలయంలో తెల్లవారుజామున నాలుగున్నర గంటల నుంచే పూజలు మొదలయ్యాయి. రామాద్రిలోని శివాలయంలోనూ భక్తులు పూజలు నిర్వహించారు.

సింహాచలం : సింహగిరి దిగువన వరాహ పుష్కరిణి, కొండపై ఉన్న గంగధార, చాకిధార వంటి సహజ ధారల్లో భక్తులు స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా సింహగిరి క్షేత్రపాలకుడు బాల త్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామిని, కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణాల్లో దీపారాధనలు జరిపారు. 98వ వార్డు పరిధి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళేశ్వరునికి, పాతఅడివివరంలోని విశ్వేశ్వరునికి, చండీపరమేశ్వరునికి, సింహపురి కాలనీలో ప్రమేశునికి కూడా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



గుడిలోవలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న పురాతన రంగనాథ నారాయణేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. అక్కడి పాతాళగంగలో స్నానాలు చేసి, శివునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గిడిజాల, బోని, కుసులువాడ, పెద్దిపాలెం, ఆనందపురం, దుక్కవానిపాలెం గ్రామాల్లోని శివాలయాల్లోనూ పూజలు జరిపారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపురసుందరీదేవి సమేత మహాకామేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుండే భక్తులు పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మిథిలాపురి వుడాకాలనీలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

ఎండాడ : ఎండాడలో ఉన్న పశుపతినాథేశ్వరుని ఆలయంలో వేకువజాము నాలుగు గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి, కైలాసగిరి దిగువన ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వర ఆలయం, కొండపై ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మారికవలసలో దీపోత్సవం

కొమ్మాది : మారికవలస సిగ్నేచ్ అపార్టుమెంట్‌లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు కార్తీకంలో దీపోత్సవం ప్రాధాన్యతను వివరించారు.

అభివృద్ధి పనులపై జడ్పీ సీఈవో ఆరా



అధికారులతో సీఈఓ రాజ్‌కుమార్

ఆనందపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో రాజ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో జానకిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఉపాధి నిధులతో చేపడుతున్న పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం అధికారులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే మండలాభివృద్ధి కార్యాలయ ఆవరణలో నిర్మించిన సమావేశ మందిరాన్ని పరిశీలించారు.

'బకాయిలు చెల్లించకుండా ఆస్తులు అమ్మరాదు'

తగరపువలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం మిల్లు ఆస్తుల అమ్మకానికి ప్రయత్నిస్తుందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మిల్లు యాజమాన్యం కార్మికులకు కోట్లాది రూపాయలు బకాయి పడిఉందని, వాటిని చెల్లించకుండా మధ్యవర్తుల ద్వారా భూములు, ఇతర ఆస్తుల అమ్మకానికి ప్రయత్నిస్తుందన్నారు. బకాయిలు చెల్లించే వరకూ అమ్మకాలు చేయరాదన్నారు.ఈమేరకు కలెక్టరుకు వినతిపత్రం అందించామన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల నిరసన



జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కొమ్మాది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ కాంట్రాక్టు, రోజువారీ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం అన్యాయమని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు అన్నారు. సోమవారం జోన్-2 కార్యాలయం అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంట్రాక్టు, డైలీవేజ్ కార్మికులు తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. అనంతరం జడ్పీ సింహాచలంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎంపీ ప్రసాద్, సీఐటీయూ ఆరిలోవ నాయకులు నరేంద్రకుమార్, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు నిర్మించాలని వినతి

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఒకటో వార్డులో రోడ్లు, కాలువలు నిర్మించాలని వార్డు వైసీపీ నాయకుడు అక్కరమాని రామునాయుడు జడ్పీ ప్రసన్నవాణిని కోరారు. సోమవారం ఆయన జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జడ్పీకి వినతిపత్రం అందించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకార నాయకులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

- ఆర్‌డీఓను కోరిన మత్స్యకార నాయకులు

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తీరంలోని శ్మశాన వాటికలను కబ్జా చేసి, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు కోరారు. సోమవారం ఆయన ఆర్డీవో సంగీత్ మాధుర్‌ను కలిసి మత్స్యకారుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరతరాలుగా మత్స్యకారులు వినియోగిస్తున్న శ్మశానవాటికను ఆక్రమించి కొందరు రెస్టారెంట్లు, నైట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. కాగా జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారులు చేపట్టిన రిలే దీక్ష సోమవారం నాటికి ఐదో రోజుకి చేరింది. ఈ కార్యక్రమంలో చేపలుప్పాడ మత్స్యకార నాయకులు కారి అప్పారావు, మైలపల్లి రాము, తోటవీధి పెద్దలు సూరాడ పరదేశి, గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

గిరిజన భాషలపై సదస్సు



మాట్లాడుతున్న ఈడీ డాక్టర్ రాణిమందా

సాగర్‌నగర్,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరికి మాతృ భాషపై పట్టు ఉండాలని గిరిజన సాంస్కృతిక, పరిశోధన శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమందా అన్నారు. రుషికొండ కార్యాలయంలో జరుగుతున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా గిరిజన భాషలపై మూడు రోజుల పాటు జరిగే సదస్సును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన భాషలు అంతరించిపోకుండా భావితరాలకు అందివ్వాలసిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. ఆదివాసీ ఒరియా, సవర, కువి, కొండా, కోయ, బంజారా, సుగాలి తదితర గిరిజన భాషలపై మెథడాలజీ పుస్తకాల తయారీ కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జగనన్న కాలనీల్లో భారీ కుంభకోణం

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి వీఎంఆర్‌డీఏకు రూ.150 కోట్లు ఇచ్చారని, కానీ అక్కడ రహదారులు, కాలువలు, విద్యుద్దీపాలు ఏమీ లేవన్నారు. ఒక్కో ఇల్లు 340 చ.అ. విస్తీర్ణం అని చెప్పారని, కానీ విశాఖలో 229 చ.అ. మాత్రమే ఉందని, ఇది రుషికొండ ప్యాలెస్ జగన్ బాత్‌రూమ్ కంటే చిన్నదని ఆరోపించారు. ఆ ఇళ్లను కూడా ఎంతో కొంత చేతిలో పెట్టి స్థానిక వైసీపీ నాయకులు తీసుకుంటున్నారని, వీటిపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరగాలని, అధికారులు ఇచ్చే కాకిలెక్కలపై ఆధార పడవద్దని మంత్రిని కోరారు.

సునీతకు జ్ఞాపిక అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ గౌతమ్‌రావు



గీతంలో గాయని సునీత సందడి

సాగర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో ప్రముఖ సినీ నేపథ్య గాయని సునీత సోమవారం సందడి చేశారు. గీతం హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతో పాటు సంగీతం, నృత్యం, చిత్రకళల్లో ఏదో ఒక అంశంలో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యార్థులకు ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమ్‌రావు ఆమెకు జ్ఞాపిక అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో గీతం హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యులు సుస్మారాజు, డాక్టర్ పి. ఆశ, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి టీటీడీ ఆలయంలో పవిత్రోత్సవాలు

సాగర్‌నగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి 28 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 25న సాయంత్రం 6 నుంచి 8.30 వరకు అంకురార్పణ, 26న పవిత్ర ప్రతిష్ఠ, 27న మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు పవిత్రాల సమర్పణ, 28న సాయంత్రం 6 నుంచి 8 వరకు పూర్ణాహుతి ఉంటుందన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి 11.30 వరకూ ఆలయంలో శ్నపన తిరుమంజనం కూడా నిర్వహించనున్నట్టు చెప్పారు.

అప్పన్న సన్నిధిలో కేరళ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి



కప్ప స్తంభం వద్ద ఐఏఎస్ అశోక్

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, కేరళ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. అశోక్ సోమవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు పర్యవేక్షణాధికారులు ప్రసాద్, పద్మనాభరాజు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఆ పనులు ఆగింది అందుకేనా?

... 5వ పేజీ తరువాయి

స్థాయిల్లో జరిమానాల పేరుతో బెదిరించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు టిక్కెట్ లేకపోతే అంతకు మించిన మొత్తం టీటీఈలు వసూలు చేయడం అందరికీ అనుభవమే. అభివృద్ధి పనులు, మరమ్మతులు చేపట్టే కాంట్రాక్టు సంస్థలను కూడా ఇలాగే బెదిరించి పబ్బం గడుపుకుంటున్నారు. సివిల్ పనుల్లో జాప్యం సహజం. అయితే వాటిని రికార్డులో నమోదు చేసి, నిబంధనల ప్రకారం చేయలేదని ఆరోపిస్తూ జరిమానా వేయడం, దానిని తగ్గించడానికి లంచాలు కోరడం రైల్వేలో చాలా సాధారణ విషయం అయిపోయిందని పులువురు ఆరోపిస్తున్నారు.ముంబై కాంట్రాక్టర్ కేసులో జరిమానా తగ్గింపునకు డబ్బులు డిమాండ్ చేసి, అది తగ్గించకుండానే బిల్లులో కోత వేసి మిగిలిన మొత్తం ఇవ్వడం వల్లనే కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారని చెబుతున్నారు.

ఏది అమ్మినా కమీషన్ ఇవ్వాల్సిందే

రైల్వేస్టేషన్‌లో రకరకాలు ఆహార పదార్థాలు, వస్తువులు విక్రయిస్తుంటారు. వారికి లైసెన్స్‌లు ఇస్తారు. ఫీజులు కట్టించుకుంటారు. అయినా సరే అధికారులకు కొంత కమీషన్ ఇవ్వాలని, లేదంటే ఆహారం కల్తీ జరిగిందని కేసులు పెడతారని, కొందరైతే ఆ వస్తువులే అమ్మకుండా చేస్తారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. నగరంలో రొట్టెలు, కేకులు, పఫ్‌లు తయారుచేసే ఓ సంస్థ కమీషన్ ఇవ్వలేదని వారి ఫుడ్ అమ్మకుండా అధికారులు నిషేధం విధించిన విషయాన్ని ఓ వ్యాపారి ఈ సందర్భంగా గుర్తుచేయడం గమనార్హం. ఈ లంచాల వ్యవహారంపై సీబీఐ సమగ్ర దర్యాప్తు చేయాలని విశాఖ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్తి పన్ను బకాయిలు 1,033.9 కోట్లు

... 5వ పేజీ తరువాయి

రావలసి ఉంది. అత్యధికంగా మళ్ల చిన్నికృష్ణ రూ.28,16,208, పిల్ల మహాలక్ష్మి రూ.10, 20,434, శేఖర్‌మంత్రి శంకరరావు రూ.9,48, 394, బొండాడ సత్యానందం రూ.8,32,246, చింత లక్ష్మీనరసమాంబ రూ.7,80,583, శారదా ఎడ్యుకేషనల్ ట్రస్టు రూ.7,76,883, బిల్లపాటి కాశీవిశ్వనాథం రూ.7,64,423, కొణతాల తాటప్పారావు రూ.7,47, 375, దొడ్డి కోటేశ్వరరావు రూ.6,17,021, మళ్ల నాగేశ్వరరావు రూ.5,12,791 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్నుతోపాటు బకాయిలుగా పేరుకుపోయిన మొత్తం నుంచి కూడా వీలైనంత వరకూ రాబట్టాలని జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలకు చెందిన కార్యాలయాలకు వెళ్లి అధికారులతో మాట్లాడుతున్నారు. అలాగే ప్రైవేటు అసెస్‌మెంట్‌ల యజమానులను కూడా కలిసి బకాయిలు చెల్లించేలా వారికి కౌన్సెలింగ్ చేయాలని భావిస్తున్నారు. కోర్టులో కేసులు ఉన్న అసెస్‌మెంట్‌ల యజమానులతో చర్చల ద్వారా పరిష్కారానికి యత్నించాలని, వాటి నుంచి బకాయిలను రాబట్టేందుకు జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు.

కార్పొరేటరా మజాకా!?

... 5వ పేజీ తరువాయి

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా నియమితులైన మరో ముఖ్యనేత ద్వారా జీవీఎంసీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి వీఎల్‌టీ కూడా లేకుండా చేసుకున్నారు.

పాఠశాల ఏర్పాటుకు రంగం సిద్ధం

దీనిపై ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలతో చేజిక్కించుకున్నారంటూ కొంత మంది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉంది. తమ పార్టీ అధికారంలో ఉండగా అధికార బలంతో అక్రమాలను సక్రమం చేసుకుని, భవన నిర్మాణం పూర్తిచేసిన కార్పొరేటర్ భర్త ఆ భవనంలో పాఠశాల ప్రారంభించేందుకు సర్వంసిద్ధం చేసుకున్నారు. అయితే విద్యాశాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో టీడీపీలో చేరేందుకు సర్వవిధాలా యత్నించారు. కానీ వార్డులోని ఆ పార్టీ నేతలు అడ్డుపడడంతో వీలు కాలేదు. విద్యా శాఖ అధికారుల నుంచి పాఠశాల ప్రారంభానికి అనుమతి రాకపోవడంతో భవనం పెండింగ్‌లో ఉండిపోయింది. దీనిపై కోర్టులో కేసు వేసిన వారు జీవీఎంసీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడడంతో ఆ భవనంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ విషయం జోన్-3 ఏసీపీ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా తాను ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, ఆ భవనం విషయం తెలియదన్నారు. ఒకటి, రెండు రోజుల్లో భవనం ఫైల్ తెప్పించుకుని, సమగ్రంగా పరిశీలించిన తర్వాత అక్రమ నిర్మాణమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రధాని ప్రకటించాలి

... 5వ పేజీ తరువాయి

పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంటు శంకుస్థాపనకు వస్తున్న ప్రధాని మోదీ...అనంతరం నిర్వహించే సభలో విశాఖ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడిపదార్థాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రం ద్వంద్వ వైఖరితో ప్లాంటు సామర్థ్యాన్ని 73 లక్షల టన్నుల నుంచి కుదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రుణాలపై వడ్డీలు లేకుండా చూడాలని, ఐదేళ్ల వరకు రుణాలు తీర్చాలని ఒత్తిడి పెట్టకూడదన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, ప్లాంటు ఆర్థిక మూలాలు దెబ్బతీసే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు జీత భత్యాలు ఇవ్వకుండా వీఆర్‌ఎస్ తీసుకుని వెళ్లిపోయే పరిస్థితి కల్పిస్తున్నారని ఆరోపించారు. వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2021 జనవరి తరువాత వచ్చిన సీఎండీ పరిపాలనలో జరిగిన అవినీతిపై సీబీడీ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ నాయకులు బొడ్డు పైడిరాజు, గణపతి రెడ్డి తదితరులు మాట్లాడారు.

వీధి వ్యాపారులకు హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలి

» కమిషనర్‌కు కార్పొరేటర్ మూర్తియాదవ్ వినతి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ జనసేన పార్టీ 22 వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధివ్యాపారులు రోడ్లు ఆక్రమించుకుని వ్యాపారాలు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలగడంతో పాటు ప్రమాదాలకు దారి తీస్తోందని,అలాంటి వారిని హాకర్స్ జోన్‌లో వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీవనోపాధి సంరక్షణ, వీధి విక్రయాల క్రమబద్ధీకరణ చట్టం-2014 ప్రకారం వీధి వర్తకులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాయితీపై మొబైల్ వ్యాన్‌లు సమకూర్చాలని, వీధి వ్యాపారుల కమిటీలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

సర్వీసు రోడ్డు మూసివేతతో ఇబ్బందులు



బారికేడ్లతో మూసివేసిన సర్వీసు రోడ్డు

ఆరిలోవ, నవంబరు 18 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల దీనదయాళ్‌పురం ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డును బారికేడ్లు ఏర్పాటు చేసి మూసి వేశారు. దీనివల్ల వాహనచోదకులు, స్కూలుకు పిల్లలను తీసుకెళ్లే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.అసలు ఈ రోడ్డులో రాకపోకలు చేయడం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అలాంటిది ఇలా మూసి వేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్థానికుల అభిప్రాయాలు, వాహనచోదకులు అవసరాలు గుర్తించకుండా ట్రాఫిక్ పోలీసులు ఇలా అనాలోచితంగా సర్వీసు రోడ్డును మూసి వేయడం తగదంటూ స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా నడవాలి'

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా నడవాలని విద్యార్థులకు ఇందిరా గాంధీనగర్‌కు చెందిన వి.చిట్టిరాణి హితవు పలికారు. నెహ్రూ జయంతి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కేఆర్ ప్రసాద్, జాన్ పాల్, గ్రామ సంఘం నాయకలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు)56, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 58 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 30,ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


కేఆర్ఎం కాలనీ శివాలయంలో పూజలు



ఆరిలోవలో పూజలో పాల్గొన్న భక్తులు, శివునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

శివాలయాల్లో కార్తీక పూజలు

» వేకువజాము నుంచి పోటెత్తిన భక్తులు
» మార్మోగిన శివనామస్మరణ
» ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యుల ఏర్పాట్లు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివదర్శనానికి భక్తులు వేకువ నుంచే బారులు తీరారు. కొత్తవెంకోజిపాలెంలో గౌరీజ్ఞానలింగేశ్వరాలయానికి విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు అర్చకులు గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా రుద్రాభిషేకం చేశారు. ఆలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన నంది విగ్రహం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి బారికేడ్ల ద్వారా శివపార్వతుల దర్శనానికి వెళ్లారు. సాయంత్రం మహిళలు ఆకాశ జ్యోతిని వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించగా, స్థానిక గ్రామసేవాసంఘం సభ్యులు సహకారం అందించారు. ఎంవీటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం దర్శనాలు, సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. హెచ్‌బీకాలనీ, ఇసుకతోట, కేఆర్ఎం కాలనీల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరిలోవలో అభిషేక పూజలు

ఆరిలోవ : ఆరిలోవలోని అన్ని శివాలయాల్లో శివనామ స్మరణతో భక్తులు మోకరిల్లారు. అర్చకులు శివలింగాలకు జీవనదులు, నారికేళ జలాలు, పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. విభూతి, చందనం, కుంకుమలు సమర్పించారు.వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో రుద్రుడిని కొలిచారు. ఆరిలోవ ఆసుపత్రి, ఆఖరి బస్టాప్ వద్ద, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక లలోని జోతిర్లింగేశ్వర, స్ఫటిక లింగేశ్వర, కోటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెదగదిలి శివాలయంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

పెదవాల్తేరు : పెదవాల్తేరులో కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయం వద్ద బారులు తీశారు.శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఆకాశ దీపం వెలిగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్యోతి, అర్చకులు కాశీ ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

రికార్డుల నిర్వహణ పట్ల అప్రమత్తం

సిరిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూ వినియోగ మార్పిడి కోసం వచ్చిన దస్త్రాలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి ముందుకెళ్లాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. సోమవారం వీఎంఆర్డీఏ భవన్‌లో ప్రణాళిక విభాగ సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. న్యాయపరమైన వివాదాలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్, జూనియర్ సహాయకుల వ్యక్తిగత లాగిన్‌లో ఉన్న దస్త్రాలను సమయపాలనను అనుసరించి ప్రక్రియ మొత్తం జరిగే విధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారులు వెంకటేశ్వరరావు, అరుణవల్లి, కిషోర్‌కుమార్, పరిపాలన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లెట్స్ చిత్రకారుడికి అభినందనలు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎన్నికల్లో అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్‌ల చిత్రపటాలను విశాఖకు చెందిన మిల్లెట్స్ ఆర్టిస్ట్ మోకా విజయ్‌కుమార్ తయారు చేశారు. ఈ చిత్రపటాలను అమెరికన్ ఎంబసీ (హైదరాబాద్) కౌన్సిలర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ డిప్యూటీ చీఫ్ జీన్ సోకోలోఫ్స్కీ, పబ్లిక్ అఫైర్స్ అధికారి అలెగ్జాండర్ మెక్లిన్‌లు సోమవారం అమెరికన్ కార్నర్‌లో ఆవిష్కరించారు. మిల్లెట్స్ ఉపయోగించి ఇరువురి చిత్రపటాలను తీర్చిదిద్దిన చిత్రకారుడు విజయ్‌కుమార్‌ను అభినందించారు. సహజత్వంతో విజయ్‌కుమార్ తయారు చేసిన చిత్రాలను చూసి వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో విజయ్ తయారు చేసిన వివిధ చిత్రాలను సైతం వారు ప్రత్యేక ఆల్బంలో వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హామీ నిలబెట్టుకోండి : సీపీఐ


సచివాలయం వద్ద సీపీఐ నాయకుల నిరసన

ఆరిలోవ,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు పేదలకు కేటాయించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆరిలోవ భగత్‌సింగ్ నగర్ నుంచి ఊరేగింపుగా వెళ్లి లక్ష్మీనగర్, శివాజీనగర్ సచివాలయాల వద్ద ధర్నా చేశారు. తూర్పు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఎస్‌కె రెహమాన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు అత్తిలి విమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్ల స్థలాలిస్తామన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు కేటాయించాలని కోరారు. ఆరిలోవలో అనేక మంది సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. దేవుడమ్మ, కె. లక్ష్మణరావు, బి. చిరంజీవి, ఎ. రవి, పుష్పలత, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధితో సమాచారం విస్తృతి


సంగీత కౌల్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సాంకేతికత అభివృద్ధి నేపథ్యంలో సమాచారం విస్తృతంగా లభ్యమవుతోందని, దీనిని సద్వినియోగం చేసుకునే విధంగా యువత అవగాహనతో నడుచుకోవాలని డెల్ నెట్ డైరెక్టర్ డాక్టర్ సంగీత కౌల్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏయూ డాక్టర్ వి.ఎస్. కృష్ణ గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం ప్లాటినం జూబ్లీ సమావేశంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ సంగీత కౌల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గ్రంథాలయాలను అనుసంధానం చేస్తూ డెల్ నెట్ పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. ఏయూ వెబ్‌సైట్‌లో డెల్ నెట్ లింక్ ఉపయోగించుకుని జర్నల్స్, పుస్తకాలు పొందే విధానాన్ని తెలియజేశారు. నాలుగు కోట్లకు పైగా పుస్తకాలు, 1.7 కోట్లకుపైగా ఈ బుక్స్, ఈ జర్నల్స్, 30 వేల మీడియా లెక్చర్స్, ఆన్లైన్ కోర్సులు వంటివి డెల్ నెట్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. 15 వేల పరిశోధన పత్రాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ జనరల్ ఫుల్ టెక్స్ రిసోర్సెస్ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని చెప్పారు. లిటరేచర్ సర్వేకు సైతం అవసరమైన పుస్తకాలను సైతం దేశవ్యాప్తంగా వేరొక లైబ్రరీ నుంచి కొరియర్ ద్వారా పంపే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

శ్రావణ్ కుమార్‌కు బీజేపీ నేతల అభినందన

ఆరిలోవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌ను ఆరిలోవకు చెందిన బీజేపీ నాయకులు సోమవారం అభినందించారు. జీసీసీ కార్యాలయంలో ఆయన్ను కలిసి శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి రేపు

సిరిపురం,నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ముగ్గురు గాయనీమణులతో 'వేణు గానమ్ము వినిపించెనే' శీర్షికన సినీ సంగీత విభావరి పోస్టర్‌ను విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ 20న సాయంత్రం 4 గంటలకు అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో నిర్వహించనున్న విభావరిలో గాయనీమణులు కోమలీ ప్రసాద్, సుజాత కంఠ, ఎం.మాధురిలతో కలిసి రమేష్ పట్నాయక్, వీకే రాజు, మనోహర్, దేవరాజ్, సత్య, విశ్వప్రసాద్‌లు పలు చిత్రగీతాలు ఆలపిస్తారన్నారు. సెంచూరియన్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, గాయకులు విశ్వప్రసాద్, కోమలి ప్రసాద్, సుజాత కంఠ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

సింహాద్రి ఎన్‌టీపీసీ హెచ్ఓపీగా సమీర్‌శర్మ



పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఓపీ (హెడ్ ఆఫ్ ద ప్రాజెక్టు)గా సమీర్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యప్రదేశ్‌లోని వింధ్యాచల్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్ ఓఅండ్ఎం విభాగ సీజీఎంగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. 1988లో ఎన్టీపీసీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన సమీర్‌శర్మ అనేక కీలక పదవులు నిర్వహించారు. సింహాద్రి ప్రాజెక్టు పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

రూ.10 కోట్ల ఆస్తి పన్ను చెల్లించిన విశాఖ పోర్టు


జీవీఎంసీ కమిషనర్‌కు చెక్కును అందిస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10 కోట్ల ఆస్తి పన్నును జీవీఎంసీ చెక్కు రూపంలో చెల్లించిందని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పోర్టు ఫైనాన్స్ మేనేజరు రమణమూర్తి నుంచి అధికారులు చెక్కును అందుకున్నారు. పన్ను వసూలులో శ్రద్ధచూపిన అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము, రెవెన్యూ అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి ఆస్తి పన్ను, బకాయిల వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



మధురవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని డాక్‌యార్డు కాలనీలో నిర్మించిన పైడిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముందుగా వేద పండితుడు కాళిదాసు బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదుర్గా హోమం, పూర్ణాహుతి తదితర పూజలు అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్రన్న, బంగారు అశోక్‌కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి ?

భీమునిపట్నం (రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్త బోని రాంబాబు ఇంటిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొంటున్నందున తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి తలుపులు, కిటికీలు స్కూటర్‌ను పాడు చేశారని, అడ్డుకున్న కుటుంబ సభ్యులపై దాడికి చేశారని చెప్పారు. దాడి వెనుక సర్పంచ్ వర్గీయులు ఉన్నట్టు ఆయన ఆరోపించారు. కాగా ఈవిషయమై సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఫిర్యాదు అందిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

'రుణాలు సద్వినియోగం చేసుకోండి'

భీమునిపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయదారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ యూసీడీ పీవో లక్ష్మి అన్నారు. సోమవారం జోన్ వన్ కార్యాలయంలో పీఎం స్వానిధి, బి, స్వాబిమాన్, బి పక్వాడ పథకాలపై వీధి విక్రయదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, భవన నిర్మాణ కార్మికుల రిజిస్ట్రేషన్, ప్రధాన మంత్రి యోగి మాన్ ధాన్, ప్రధాన మంత్రి మాతృ వందన పథకాలపై వివరించారు. అనంతరం 33 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి, యూసీడీ డీపీవో కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'అపార్ కార్డుల జారీలో శ్రద్ధ చూపాలి'

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యుడు గొండు సీతారాం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో అన్ని జిల్లాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధార్ కార్డుల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, స్కూల్ రికార్డుల్లో జన్మదిన తేదీల్లో మార్పులు, స్థానిక సంస్థల్లో నమోదై ఉన్న జనన ధ్రువీకరణ పత్రాలలో విద్యార్థుల పూర్తి పేర్లు నమోదు కాకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. అక్షర దోషాలు సరిచేసేందుకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఆయా జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులోకి లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. కమిషన్‌కు నిత్యం ఫిర్యాదులు అందుతున్నందున కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖాధికారులు, ఇంటర్మీడియట్ ఆర్ఐఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆధార్ సంబంధిత అధికారులకు తమ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పేరిట ఆదేశాలు జారీ చేసినట్టు సీతారాం పేర్కొన్నారు.

ఘనంగా సత్యసాయి పాదుకోత్సవం


సత్యసాయి పాదుకలను ఊరేగిస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో సామూహిక సత్యసాయి పాదుకోత్సవం, సంగీత విభావరి నిర్వహించారు. భక్తులు తమ ఇంటి పూజా మందిరాల్లో ఉన్న స్వామి పాదుకలను తీసుకువచ్చి, పూజించారు. అనంతరం సత్యసాయి పాఠశాల విద్యార్థి సార్థక్ తన సంగీతంతో భక్తులను అలరించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు నాయుడు, సేవా సమితి, భజన మండళ్ల కన్వీనర్లు, పదాధికారులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ప్రసాద్, తెలుగు ఉపాధ్యాయిని సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధితో ఉజ్వల భవిత

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో యాజమాన్య, ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా అన్ని రంగాల నిపుణులను తీసుకువచ్చి అతిథి ఉపన్యాసాలు, సదస్సులు, కార్యశాలలు నిర్వహిస్తున్నామని, ప్రతి విద్యార్థి శ్రద్ధతో నేర్చుకుని ఆకాశమే హద్దుగా ఎదుగుతూ ప్రపంచంలో ఎక్కడ అవకాశం ఉన్నా వాటిని అందిపుచ్చుకోవాలని మేనేజ్‌మెంట్ కామర్స్ హెచ్‌ఆర్ఎం సూచించింది. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లోని స్మార్ట్ సెమినార్ హాల్‌లో విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 'స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్'పై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. దీనికి రిసోర్స్ పర్సన్‌గా డిపార్టుమెంట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ) ప్రొఫెసర్ భూషణ్ డీ సుధాకర్ హాజరై విద్యార్థులకు 'స్టార్టప్ ఆఫ్ ఇన్నోవేషన్' ప్రాధాన్యాన్ని ఉదాహరణలతో వివరించారు. ఏ స్టార్టప్ అయినా చిన్నగా మొదలైన తరువాత తమ కృషి మేరకు భారీ స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. చిన్న స్టార్టప్ అని ఎప్పుడూ తక్కువ అంచనా ఆలోచనకు రాకూడదంటూ స్థానిక జాతీయ, అంతర్జాతీయ స్టార్టప్స్‌ను వివరించారు. బ్లూ ఓషన్ స్ట్రాటజీ, రెడ్ ఓషన్ స్ట్రాటజీ ఏవిధంగా స్టార్టప్‌పై ప్రభావం ఉంటుందో చెప్పారు. ప్రస్తుతం ప్రతి విద్యార్థి ఇన్నోవేషన్‌తో స్టార్టప్స్ స్థాపించే దిశగా ముందడుగు వేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థి వీసాలపై అవగాహన


మాట్లాడుతున్న సోకోలోఫ్స్కీ

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏయూ విద్యార్థులు అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడానికి అవసరమైన వీసాల దరఖాస్తు, మంజూరు విధానంపై అమెరికా రాయబార కార్యాలయం (హైదరాబాద్) కౌన్సిలర్ ఇన్ఫర్మేషన్ యూనిట్, డిప్యూటీ చీఫ్ జీన్ సోకోలోఫ్స్కీ సోమవారం అవగాహన కల్పించారు. అమెరికన్ కార్నర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొని విద్యార్థి వీసాల విధానాన్ని తెలియజేశారు. అమెరికాలో సుమారు 4,500 ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు ఎఫ్1 వీసా మంజూరు చేస్తామన్నారు. దీనికి ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ యూఎస్ఏ సహకారం అందిస్తుందని చెప్పారు. వీసా దరఖాస్తు ప్రక్రియను 18 నెలలు ముందుగా చేసుకోవాలని సూచించారు. వీసా దరఖాస్తులో ఐదు దశలను వివరించారు. వీసా కు కావాల్సిన డాక్యుమెంట్లపై అవగాహన కల్పించారు. వీసీ అధికారితో ఇంటర్వ్యూ, అక్కడ అడిగే ప్రశ్నల విధానాన్ని తెలియజేశారు. వీసా అధికారి వద్ద జరిగే ఇంటర్వ్యూ పరస్పర సంభాషణగా సాగాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ డాక్యుమెంట్లను జత చేయవద్దన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో అమెరికా రాయబార కార్యాలయ ప్రజావ్యవహారాల అధికారి అలెగ్జాండర్ మేక్లైన్, ఏయూ అమెరికన్ కార్నర్ సమన్వయకర్త ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డీఎల్‌డీఓగా ఉషారాణి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ)గా సి.ఉషారాణి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె డ్వామాలో పరిపాలన అధికారిగా పని చేస్తూ డీఎల్‌డీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆమెను పూర్తిస్థాయి అధికారిగా నియమిస్తున్నట్టు పేర్కొంది.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు పరిశీలన

తగరపువలస, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలసలో జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శివరాణి సూచించారు. సోమవారం ఆమె శిక్షణా తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ. 12 వేలు చొప్పున కేంద్రం ఉపకార వేతనం అందిస్తుందన్నారు.

నేటి నుంచి బాలోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

డాబాగార్డెన్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ బాలోత్సవం ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రఘు, జి.ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో నిర్వహిస్తున్న బాలోత్సవంలో వేలాదిమంది పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యక్షురాలు రమాప్రభ, కోశాధికారి నాగేశ్వరరావు, సభ్యులు ఎల్లాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

పూర్ణామార్కెట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో మనస్పర్థలతో ఫిషింగ్ హార్బర్ బీచ్ వద్ద ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అడ్డుకుని అతని ప్రాణాలు కాపాడినట్లు సీఐ దేముడుబాబు తెలిపారు. మన్యం జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం ఫిషింగ్ హార్బర్ బీచ్ వద్ద ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని సమాచారం అందిన వెంటనే హార్బర్ మొబైల్ హెచ్‌సి, బ్లూకాట్ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి అతనిని కాపాడినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చి అతని కుటుంబీకులను పిలిపించి అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

మాజీ మంత్రులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

డాబాగార్డెన్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను వైసీపీ పాలనలో దుర్భాషలాడిన మాజీమంత్రులు అంబటి రాంబాబు, కొడాలి నాని, ఆర్కే రోజాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు విల్లూరి చక్రవర్తి, విల్లూరి తిరుమలదేవిలు తెలిపారు. అసభ్య పదజాలంతో మంత్రి పదవులకే కళంకం తెచ్చిన వీరిపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పొట్లూరు మీనాక్షి, ఎల్.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు శిక్షణ

కంచరపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం నుంచి జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానున్నాయి. తొలిరోజు బయాలజీ, బుధవారం ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులపై శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. అర్బన్ నాలుగు మండలాలతో పాటు గోపాల పట్టణం పరిధిలోని ఉన్నత పాఠశాలల సబ్జెక్టు ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నారని మండల విద్యాశాఖాధికారులు సోమేశ్వరరావు, దివాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పి.వెంకటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, జి.ఆనంద్, జానకీరామ్ ఆర్పీలుగా వ్యవహరిస్తారు.

మానసిక వికలాంగులకు ప్రత్యేక శిక్షణ తరగతులు

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం మానసిక వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపల్ కమల్‌జిత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇతర విద్యార్థులతో సమానంగా చదువుకునేలా ప్రత్యేకంగా ఒక ఆయా, ఉపాధ్యాయురాలిని నియమించామన్నారు. కొంతమంది చిత్రలేఖనం, స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. తల్లిదండ్రుల సహకారంతో ఇష్టమైన రంగంలో ఎదుగుతున్నారని పేర్కొన్నారు. ఈ విద్యార్థులకు వీల్ చైర్, కౌన్సెలింగ్, వాష్ రూమ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు.

కనీస వేతనాలకు డిమాండ్

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ పారిశుధ్య సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేల వంతున చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్సు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కేజీహెచ్‌లో పరిపాలనా విభాగం వద్ద ఆందోళన నిర్వహించి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌కు వినతిపత్రం అందించారు.

కర్రసాము క్రీడాకారులకు సత్కారం



సత్కరిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన సహాయ సహకారాలు ఉంటాయని సంఘ సేవకుడు వీవీ రాజు అన్నారు. అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ చిల్డ్రన్ పార్కులో కర్రసాము క్రీడాకారులను సోమవారం రాత్రి సత్కరించారు. బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. వీరికి మంచి శిక్షణ అందించిన కోచ్ లక్ష్మణ్ దేవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో లా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరావు, న్యాయవాది రమేష్, కాళ్ల శ్రీనివాసరావు, జగన్నాధరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు, మంచినీటి సరఫరాపై ప్రణాళికలివ్వండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత నీటిని సరఫరా చేస్తూ, పారిశుధ్య ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఈ విభాగం అధికారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు, సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివిధ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు. సామాజిక మరుగుదొడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల్లో మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 10 వరకు గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి అవసరాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు నారాయణమూర్తి, ప్రేమ్‌కుమార్, పూర్ణిమా దేవి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అనధికార సంఘంపై చర్యలకు ఫిర్యాదు

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల చౌరబాటుకు గురైన జిల్లా ఫుట్‌బాల్ సంఘానికి పునరుజ్జీవం కల్పించాలని వాల్తేరు ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ స్పోర్ట్సు కోడ్ నిబంధనలు ఉల్లంఘించి విశాఖతో సంబంధం లేని నీలాద్రి వెంకటకుమార్ (నిడదవోలు), కుమ్మరికుంట రాజేష్ (జంగారెడ్డి గూడెం), వేమిరెడ్డి హరికృష్ణ (భీమవరం), వేమిరెడ్డి రవితేజ (విజయనగరం) వంటి కొందరితో కలిసి చట్ట విరుద్ధంగా అనధికార జిల్లా ఫుట్‌బాల్ సంఘాన్ని సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి కార్యకలాపాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా విశాఖ జిల్లా ఫుట్‌బాల్ సంఘం రిజిస్ట్రేషన్‌లో భాగస్వాములైన వారంతా ఇతర జిల్లాల ఫుట్‌బాల్ సంఘాలలో అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారని, ఇది స్పోర్ట్సు కోడ్ నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా చట్ట విరుద్ధమని తెలిపారు. సమాచార చట్టం ద్వారా వివరాలు జత పరిచామని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాజకీయ పలుకుబడితో మున్సిపల్ స్టేడియంలో ఫుట్‌బాల్ సంఘం కార్యాలయాన్ని కూడా ఆక్రమించి సుమారు రూ.రెండు లక్షల విలువైన క్రీడా సామగ్రి, ఇతర వస్తువులను అధీనంలో ఉంచుకున్నారని వినతిపత్రంలో తెలిపారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

బాక్సింగ్ టోర్నీ విజేత బుల్లయ్య కళాశాల



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి మధుకుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల బాక్సింగ్ టోర్నీలో లంకపల్లి బుల్లయ్య కాలేజి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పురుషుల, మహిళల విభాగాల్లో టీం చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. బుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థిని ఎస్‌జి జెఎస్.మల్లిక ఉత్తమ బాక్సర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో కాలేజి కార్యదర్శి జి.మధుకుమార్ పాల్గొని పురుషులు, మహిళల విభాగాలలో టీం చాంపియన్‌షిప్ ట్రోఫీలను సొంతం చేసుకోవడం ఆనందదాయకమని, చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి రాణించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, గంగాభవాని పాల్గొన్నారు.

సింహాద్రి హెచ్‌ఓపీగా సమీర్‌శర్మ



పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఓపీ (హెడ్ ఆఫ్ ద ప్రాజెక్టు)గా సమీర్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యప్రదేశ్‌లోని వింధ్యాచల్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్ ఓఅండ్ఎం విభాగ సీజీఎంగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. 1988లో ఎన్టీపీసీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన సమీర్‌శర్మ అనేక కీలక పదవులు నిర్వహించారు. సింహాద్రి ప్రాజెక్టు పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

అక్కయ్యపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తల్లిదండ్రులను కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని పావని దివ్యాంగ పాఠశాలలో సోమవారం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. దివ్యాంగ విద్యార్థుల సమస్యలపై ఆ సంస్థ ఏడీతో చర్చించామన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ అనురాధ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య వివరాల నమోదు

సీతమ్మధార, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సంక్షేమం, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స అందించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త డాక్టర్ పూర్ణేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డీఎల్‌డీఓగా ఉషారాణి

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ)గా సి.ఉషారాణి నియమితులయ్యారు. ప్రస్తుతం డ్వామాలో పరిపాలన అధికారిణిగా పనిచేస్తూ డీఎల్‌డీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పూర్తిస్థాయి అధికారిగా నియమిస్తున్నట్టు పేర్కొంది.

జ్వరాలపై సర్వే నిర్వహించాలి



హెల్త్ సెంటర్‌ను సందర్శించిన గంకల అప్పారావు

కంచరపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో జ్వరపీడితులు పెరుగుతున్న నేపథ్యంలో ఇంటింటా సర్వే చేపట్టి వైద్యం అందించాలని కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు కోరారు. కప్పరాడలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కాలానుగుణ వ్యాధులు, జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జ్వరపీడిత గ్రామాల్లో సర్వే చేపట్టి అవసరమైన మందులు ఇవ్వాలని కోరారు. పచ్చకామెర్ల వ్యాధికి పరీక్షలు అందుబాటులో లేవని సిబ్బంది తెలపడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రూ.10 కోట్ల ఆస్తి పన్ను చెల్లించిన విశాఖ పోర్టు



కమిషనర్‌కు చెక్కును అందిస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.10 కోట్ల ఆస్తి పన్నును జీవీఎంసీ చెక్కు రూపంలో చెల్లించిందని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పోర్టు ఫైనాన్స్ మేనేజరు రమణమూర్తి నుంచి అధికారులు చెక్కును అందుకున్నారు. పన్ను వసూలులో శ్రద్ధచూపిన అదనపు కమిషనర్ ఆర్‌సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము, రెవెన్యూ అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నుంచి ఆస్తి పన్ను, బకాయిల వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు.

అన్న క్యాంటీన్ సిబ్బందిపై దాడి

పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

రక్షణ కోరుతున్న మహిళా సిబ్బంది



తమకు రక్షణ కావాలంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సిబ్బంది

జగదాంబ కూడలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టర్నర్ చౌల్ట్రీ అన్న క్యాంటీన్ సిబ్బంది కొంతమంది మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. మహిళా సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడ్డారని క్యాంటీన్ విధుల్లో ఉన్న సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో అన్నక్యాంటీన్ ఓ ఉద్యోగిని చెయ్యి బెణికిందని సిబ్బంది వాపోయారు. సోమవారం అన్నక్యాంటీన్‌లో ఉదయం 9 గంటల సమయంలో అల్లిపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అల్పాహారానికి వచ్చారు. వీరిలో ఓ వ్యక్తి చట్నీ కోసం క్యాంటీన్ సిబ్బంది దగ్గరకు వెళ్లి అడగ్గా, తన కంటే వెనుక వచ్చిన వారికి వేయడం పట్ల సిబ్బందితో గొడవకు దిగారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న క్యాషియర్ సముదాయించే ప్రయత్నం చేశారు. ఆ వ్యక్తి క్యాంటీన్ లోపల మొబైల్‌తో వీడియో తీయడంతో క్యాషియర్ అయిన మహిళ మొబైల్ లాక్కున్నారు. దీంతో వీరి మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో క్యాషియర్ చేయి పట్టుకొని లాగేసి దాడికి పాల్పడడంతో మిగతా సిబ్బంది అడ్డుకొనే ప్రయత్నం చేశారు. క్యాంటీన్ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తి మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో అన్నక్యాంటీన్ నిర్వాహకులు, సిబ్బంది వెళ్లి పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించారు. ఇరుపక్షాలతో మాట్లాడిన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని మందలించి వదిలేశారని సిబ్బంది తెలిపారు. అయితే అన్న క్యాంటీన్లలో పనిచేసే సిబ్బందిపైన కొంతమంది వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. చట్నీ వేయడంలో ఆలస్యం జరిగిందన్న కారణంగా దాడికి పాల్పడి ఒక యువతి చెయ్యి విరగ్గొట్టారని, పొట్టకూటి కోసం అన్న క్యాంటీన్‌లో పనిచేసుకుంటున్న మహిళలను కించపరిచేలా మాట్లాడడం తమకు నిత్యం ఎదురవుతోందని ఆవేదన వెలిబుచ్చారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద అధిక సంఖ్యలో జనం వస్తున్నందున పోలీసులు రక్షణ కల్పించాలని క్యాంటీన్ మహిళా సిబ్బంది కోరుతున్నారు.

స్పందనకు నాలుగు ఫిర్యాదులు

జ్ఞానాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు తప్పక హాజరుకావాలని ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో 4 వినతులు స్వీకరించారు. అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో గ్రంథాలయ వారోత్సవాలు

జ్ఞానాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, కవితా వచనం పోటీలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో వీకే జయలక్ష్మిని సిస్టర్లు డెయిజీ, దీపాలి, ఏంజలీన్, సిస్టర్ హేమ తదితరులు పాల్గొన్నారు.

మంచి సినిమాలను ప్రోత్సహించాలి



బాల నటుడు అరుణ్‌దేవ్, దర్శకుడు నందకిషోర్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంచి సినిమాలను ప్రోత్సహించాలని, తక్కువ బడ్జెట్‌తో రూపొందించాలని చిత్ర దర్శకుడు ఈమని నంద కిషోర్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం 'చిన్న కథ కాదు' తెలుగు సినిమా ప్రదర్శన చిత్ర దర్శకులు ఈమని నంద కిషోర్, బాల నటుడు అరుణ్ దేవ్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలలు చదువులో ఎదుర్కొన్న సమస్యలు మానవ సంబంధాలు ఇతివృత్తంగా రూపొందించి, పలు అవార్డులు పొంది 2024 గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఎంపికైందని తెలిపారు. సినీ దర్శకుడు నంద కిషోర్, బాల నటుడు అరుణ్ దేవ్‌లను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, చాట్ల బాబురావు రెడ్డి, డాక్టర్ డి.వి. సూర్యారావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, ఉషారాణి, బి.చిన్నారావు పాల్గొన్నారు.

ఆ పనులు ఆగింది అందుకేనా?

... 5వ పేజీ తరువాయి

స్థాయిల్లో జరిమానాల పేరుతో బెదిరించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు టిక్కెట్ లేకపోతే అంతకు మించిన మొత్తం టీటీఈలు వసూలు చేయడం అందరికీ అనుభవమే. అభివృద్ధి పనులు, మరమ్మతులు చేపట్టే కాంట్రాక్టు సంస్థలను కూడా ఇలాగే బెదిరించి పబ్బం గడుపుకుంటున్నారు. సివిల్ పనుల్లో జాప్యం సహజం. అయితే వాటిని రికార్డులో నమోదుచేసి, నిబంధనల ప్రకారం చేయలేదని ఆరోపిస్తూ జరిమానా వేయడం, దానిని తగ్గించడానికి లంచాలు కోరడం రైల్వేలో చాలా సాధారణ విషయం అయిపోయిందని పులువురు ఆరోపిస్తున్నారు. ముంబై కాంట్రాక్టర్ కేసులో జరిమానా తగ్గింపునకు డబ్బులు డిమాండ్ చేసి, తగ్గించకుండానే బిల్లులో కోత వేసి మిగిలిన మొత్తం ఇవ్వడంతోనే కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారని చెబుతున్నారు.

ఏది అమ్మినా కమీషన్ ఇవ్వాల్సిందే

రైల్వేస్టేషన్‌లో రకరకాలు ఆహార పదార్థాలు, వస్తువులు విక్రయిస్తుంటారు. వారికి లైసెన్స్‌లు ఇస్తారు. ఫీజులు కట్టించుకుంటారు. అయినా సరే అధికారులకు కొంత కమీషన్ ఇవ్వాలని, లేదంటే ఆహారం కల్తీ జరిగిందని కేసులు పెడతారని, కొందరైతే ఆ వస్తువులే అమ్మకుండా చేస్తారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. నగరంలో రొట్టెలు, కేకులు, పఫ్‌లు తయారుచేసే ఓ సంస్థ కమీషన్ ఇవ్వలేదని వారి ఫుడ్ అమ్మకుండా అధికారులు నిషేధం విధించిన విషయాన్ని ఓ వ్యాపారి ఈ సందర్భంగా గుర్తుచేయడం గమనార్హం. ఈ లంచాల వ్యవహారంపై సీబీఐ సమగ్ర దర్యాప్తు చేయాలని విశాఖ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేటరా మజాకా!?

... 5వ పేజీ తరువాయి

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా నియమితులైన మరో ముఖ్యనేత ద్వారా జీవీఎంసీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి వీఎల్‌టీ కూడా లేకుండా చేసుకున్నారు.

పాఠశాల ఏర్పాటుకు రంగం సిద్ధం

దీనిపై ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలతో చేజిక్కించుకున్నారంటూ కొంతమంది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉంది. తమ పార్టీ అధికారంలో ఉండగా అధికార బలంతో అక్రమాలను సక్రమం చేసుకుని, భవన నిర్మాణం పూర్తిచేసిన కార్పొరేటర్ భర్త ఆ భవనంలో పాఠశాల ప్రారంభించేందుకు సర్వంసిద్ధం చేసుకున్నారు. అయితే విద్యాశాఖ నుంచి అనుమతులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో టీడీపీలో చేరేందుకు సర్వవిధాలా యత్నించారు. కానీ వార్డులోని ఆ పార్టీ నేతలు అడ్డుపడడంతో వీలు కాలేదు. విద్యా శాఖ అధికారుల నుంచి పాఠశాల ప్రారంభానికి అనుమతి రాకపోవడంతో భవనం పెండింగ్‌లో ఉండిపోయింది. దీనిపై కోర్టులో కేసు వేసిన వారు జీవీఎంసీ అధికారులకు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడడంతో ఆ భవనంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ విషయం జోన్-3 ఏసీపీ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా తాను ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, ఆ భవనం విషయం తెలియదన్నారు. ఒకటి, రెండు రోజుల్లో భవనం ఫైల్ తెప్పించుకుని, సమగ్రంగా పరిశీలించిన తర్వాత అక్రమ నిర్మాణమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్తి పన్ను బకాయిలు 1,033.9 కోట్లు

... 5వ పేజీ తరువాయి

రావలసి ఉంది. అత్యధికంగా మళ్ల చిన్నికృష్ణ రూ.28,16,208, పిల్ల మహలక్ష్మి రూ.10, 20,434, శేఖర్ మంత్రి శంకరరావు రూ.9,48, 394, బొండాడ సత్యానందం రూ.8,32,246, చింత లక్ష్మీనరసమాంబ రూ.7,80,583, శారదా ఎడ్యుకేషనల్ ట్రస్టు రూ.7,76,883, బిల్లపాటి కాశీవిశ్వనాథం రూ.7,64,423, కొణతాల తాటప్పారావు రూ.7,47, 375, దొడ్డి కోటేశ్వరరావు రూ.6,17,021, మళ్ల నాగేశ్వరరావు రూ.5,12,791 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్నుతోపాటు బకాయిలుగా పేరుకుపోయిన మొత్తం నుంచి కూడా వీలైనంత వరకూ రాబట్టాలని జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలకు చెందిన కార్యాలయాలకు వెళ్లి అధికారులతో మాట్లాడుతున్నారు. అలాగే ప్రైవేటు అసెస్‌మెంట్‌ల యజమానులను కూడా కలిసి బకాయిలు చెల్లించేలా వారికి కౌన్సెలింగ్ చేయాలని భావిస్తున్నారు. కోర్టులో కేసులు ఉన్న అసెస్‌మెంట్‌ల యజమానులతో చర్చల ద్వారా పరిష్కారానికి యత్నించాలని, వాటి నుంచి బకాయిలను రాబట్టేందుకు జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకోవాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు.

'ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రధాని ప్రకటించాలి'

... 5వ పేజీ తరువాయి

పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్లాంటు శంకుస్థాపనకు వస్తున్న ప్రధాని మోదీ...అనంతరం నిర్వహించే సభలో విశాఖ ఉక్కుపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడిపదార్థాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షులు ఆదినారాయణ మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రం ద్వంద్వ వైఖరితో ప్లాంటు సామర్థ్యాన్ని 73 లక్షల టన్నుల నుంచి కుదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రుణాలపై వడ్డీలు లేకుండా చూడాలని, ఐదేళ్ల వరకు రుణాలు తీర్చాలని ఒత్తిడి పెట్టకూడదన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, ప్లాంటు ఆర్థిక మూలాలు దెబ్బతీసే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు జీత భత్యాలు ఇవ్వకుండా వీఆర్ఎస్ తీసుకుని వెళ్లిపోయే పరిస్థితి కల్పిస్తున్నారని ఆరోపించారు. వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2021 జనవరి తరువాత వచ్చిన సీఎండీ పరిపాలనలో జరిగిన అవినీతిపై సీబీడీ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. టీఎన్‌టీయూసీ నాయకులు బొడ్డు పైడిరాజు, గణపతి రెడ్డి మాట్లాడారు.

జగనన్న కాలనీల్లో భారీ కుంభకోణం

... 5వ పేజీ తరువాయి

అభివృద్ధికి వీఎంఆర్‌డీఏకు రూ.150 కోట్లు ఇచ్చారని, కానీ అక్కడ రహదారులు, కాలువలు, విద్యుద్దీపాలు ఏమీ లేవన్నారు. ఒక్కో ఇల్లు 340 చ.అ. విస్తీర్ణం అని చెప్పారని, కానీ విశాఖలో 229 చ.అ. మాత్రమే ఉందని, ఇది రుషికొండ ప్యాలెస్ జగన్ బాత్‌రూమ్ కంటే చిన్నదని ఆరోపించారు. ఆ ఇళ్లను కూడా ఎంతో కొంత చేతిలో పెట్టి స్థానిక వైసీపీ నాయకులు తీసుకుంటున్నారని, వీటిపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరగాలని, అధికారులు ఇచ్చే కాకిలెక్కలపై ఆధార పడవద్దని మంత్రిని కోరారు.

బోళాశంకరుడికి కార్తీక పూజలు



సీతంపేటలో రజిత కవచ అలంకరణలో పార్వతీపరమేశ్వరులు.



జగ్గారావు బ్రిడ్జి సమీపంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

డాబాగార్డెన్స్/సీతంపేట/జగదాంబ కూడలి/అక్కయ్యపాలెం/ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివాలయాల్లో అర్చనలు, అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. డాబాగార్డెన్స్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా దేవాదాయ శాఖ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని చంద్రమౌళీశ్వర స్వామివారిని దర్శించుకుని పంచాక్షరి మంత్రాన్ని పాఠిస్తూ అభిషేకాలు, పూజలు నిర్వహించుకున్నారు. అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి సమీపంలో గౌరీపరమేశ్వరాలయం, రామకృష్ణా నగర్‌లోని రామలింగేశ్వరాలయం, లక్ష్మీనారాయణపురంలోని ఉమా కాశీ విశ్వేశ్వరాలయం, రైల్వేన్యూకాలనీలోని ఉమా నీలకంఠేశ్వరాలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. సీతంపేట గణేష్ నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో స్వామి వారు రజిత కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నక్కవానిపాలెంలో గల ఉమీనీలకంఠేశ్వరస్వామి ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. దసపల్లా దరి శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం కార్తీకమాసం సోమవారం అభిషేక పూజా విధానం పట్ల భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.అభిషేక పూజా విధానంలో మార్పు పై భక్తుల నుండి వస్తున్న అభ్యంతరాలను విశ్వేశ్వర స్వామి ఆలయం ఈవో దేవుళ్ళ దృష్టికి తీసుకు వెళ్లగా, అభిషేకం టిక్కెట్ తీసుకొని గోత్రనామాలు భక్తులు ఏవరికి వారు మనస్సులో అనుకోవడం తర్వాత అర్చన జరిపి ప్రసాదాలు ఇవ్వడం నిజమేనన్నారు. భక్తుల అసంతృప్తిని ఆంధ్రజ్యోతి ఆయన ముందుంచింది దీనిపై స్పందించిన ఆయన ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని బదులిచ్చారు.



డాబాగార్డెన్స్‌లో అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

ఆరు మద్యం సీసాలు సాధీనం

గాజువాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోవాకు చెందిన ఆరు మద్యం సీసాలను అక్రమంగా తీసుకువచ్చిన ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు గాజువాక ఎక్సైజ్ పోలీసులు సోమవారం తెలిపారు. గాజువాక దవమికొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న కె.లక్ష్మీవరప్రసాద్ గోవా నుంచి ఆరు మద్యం బాటిళ్లను తెస్తుండగా దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ నాగ శ్రీనివాసరావు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 17 వినతులు

గాజువాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 17 వినతులు వచ్చాయి. పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, వీధి లైట్లు వేయాలని, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ నాయకులు, వీధి రోడ్ల గోతులను పూడ్చాలని పలువురు నాయకులు వినతిపత్రాలను జెడ్సీకి అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశించారు.

చెరువులో వ్యర్థాల తొలగింపు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో పేరుకుపోయిన నాతయ్యపాలెం కృష్ణ మహంతి చెరువులో సోమవారం స్థానిక యువకులు శ్రమదానం చేసి వాటిని తొలగించారు. చెరువులోని వ్యర్థాలు, కర్రలు, మొక్కలు, వంటి వాటిని తొలగించి శుభ్రపరిచారు. ఆ యువకులను కాలనీ నాయకులతో పాటు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అభినందించారు.

బైపాస్ రోడ్డును ఏర్పాటు చేయాలి

అగనంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఏలేరు కాలువ మీదుగా బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని స్థానిక అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు కోరారు. స్థానికంగా సోమవారం వారు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్టీపీసీ ఫ్లైయాష్, హిందూజా పరిశ్రమ బొగ్గు తరలింపు వల్ల లంకెలపాలెం, పరిసర ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫార్మాసిటీ పరిశ్రమల కారణంగా ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉంటున్నాయని, ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశాలను ఎంపీ,ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. సమావేశంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, నాయకులు పైలా జగన్నాథరావు, బి.అప్పారావు, బి.ఆనందరావు, ఎ.దుర్గినాయుడు, ఎస్.అప్పారావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

గాజువాక,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16, 17 తేదీల్లో ఎండాడలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన గాజువాకకు చెందిన క్రీడాకారులను సోమవారం అమరావతి పార్కులో అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావులు మాట్లాడుతూ గాజువాకకు చెందిన 38 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో 11 పసిడి,26 రజిత, 19 కాంస్య పతకాలు సాధించడం ప్రశంసనీయమన్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. కరాటే మాస్టర్లు సన్ని, ఆనంద్, నాయకులు కృష్ణారావు, రమేశ్, మహాలక్ష్మినాయుడు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 56, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 45, బూడిద గుమ్మడికాయ 30, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	90
ఫారం ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200


కణితిలో శ్రీఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో త్రినేత్రుడు


స్టీల్‌ప్లాంటులోని శివాలయంలో పూజలందుకున్న మహాశివుడు


అగనంపూడి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


మాతృశ్రీ నగర్ శివాలయంలో మారేడు దళాలతో అలంకరించిన శివలింగం

హరహర మహాదేవ..

కార్తీక మాసం మూడో సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కూర్మన్నపాలెం/ఆటోనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మూడో సోమవారం సందర్భంగా పలు ప్రాంతాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిట లాడాయి. హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమశ్శివాయ వంటి నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. వేకువజాము నుంచే అధిక భక్తులు శైవ క్షేత్రాల వద్ద బారులుతీరారు. మధ్యాహ్నం పలు ఆలయాల వద్ద అన్న సమారాధనలు చేపట్టారు. ఇందులో భాగంగా 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాల యంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ల ఆధ్వర్యంలో మారేడు దళాలతో శివలింగాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. 87వ వార్డు కణితి పద్మశాలి వీధిలో శ్రీఉమామార్కండేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, అఖండ దీపారాధనలు, సామూహిక పూజలు జరిపారు. కార్తీక దామోదర.. మోక్ష దామోదర.. వైకుంఠ దామోదర.. అంటూ మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. రావి, వేప, జమ్మి, తులసి, మర్రిచెట్ల వద్ద పూజలు చేశారు. 87వ వార్డు వడ్లపూడిలో శ్రీసీతారామలింగేశ్వరస్వామి లయంలోని బ్రహ్మసూత్ర శివలింగం వద్ద సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలాగే 70వ వార్డు చట్టివానిపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం, పూజలు జరిపారు. 71వ వార్డు ఆటోనగర్ తోకాడలో శ్రీదుర్గా మల్లికార్జునస్వామి స్ఫటిక శివలింగానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. శ్రీనగర్, కుంచుమాంబ కాలనీ శివాలయంలో, రాజీవ్‌నగర్‌లో సోడ సోమన్న ఈశ్వరాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్: గాజువాక సనత్‌నగర్‌లోని ఏకాంబరేశ్వర ఆలయంలో సామూహిక పూజలు చేశారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈవో అల్లు జగన్నాథరావు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ శివాలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్‌తో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి: పెదమడక ఉమామహేశ్వరాలయం, పాతఅగనంపూడి లింగాల తిరుగుడి, కర్రివానిపాలెం, జాబిలి హిల్స్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివలింగాల వద్ద పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసంలో నిత్యం ప్రత్యేక పూజలు జరుపుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పెదగంట్యాడ: ఇక్కడి బాలచెరువు రోడ్డులోని ఉమారామలింగేశ్వరాలయం, దుర్గవానిపాలెం గౌరీపరమేశ్వరుల ఆలయం, ప్రియదర్శనీ కాలనీ, వికాస్‌నగర్‌లోని శివాలయం, వెంకన్నపాలెం ఈశ్వరాలయం, నెల్లిముక్కులోని కాశీవిశ్వేశ్వరాలయం, నడుపూరులోని చంద్రశేఖరాలయంలో పూజలు, అభిషేకాలు, జరిపారు. దుర్గవానిపాలెం ఆలయంలో సాయంత్రం దీపప్రజ్వలన ఉత్సవాన్ని నిర్వహించారు. ఐదువేల దీపాలను వెలిగించారు. రాత్రికి పలు ఆలయాల వద్ద భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం ప్రాంతాల్లోని శివాలయాల్లో, తుంగ్లాంలోని విజయరాఘవస్వామి ఆలయంలో పూజలు జరిపారు. బీహెచ్‌పీవీ సమీపంలోని ఓ జిమ్‌లో వ్యాయామ పరికరాలతో ఏర్పాటు చేసిన శివలింగానికి పూజలు నిర్వహించారు.


బీహెచ్‌పీవీ వద్ద ఓ జిమ్‌లో వ్యాయామ పరికరాలతో రూపొందించిన శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

ఎస్ఎంఎస్-2 ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ ఉక్కు సీజీఎంకు వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)2లో ఈ నెల మూడో తేదీన జరిగిన అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టలని డిమాండ్ చేస్తూ సీజీఎం (వర్క్స్)కు సోమవారం సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రమాదంలో విలువైన ఎలక్ట్రికల్ కేబుల్స్‌తో పాటు పలు పరికరాలు కాలిపోయాయన్నారు. ఆయా యంత్ర సామగ్రిని కొనుగోలు చేసేందుకు రూ.వందల కోట్లు ఖర్చవుతుందని, ఇది ప్లాంటుకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించిందన్నారు. భారీ ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని, ప్రమాద సమయంలో అగ్నిమాపక సిబ్బంది లోపలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా కేబుల్ గ్యాలరీకి వెళ్లే తలుపులకు వెల్డింగ్ చేసినట్టు తెలుస్తుందని, వీటన్నింటి సమగ్ర విచారణ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఈ.శ్రీనివాసరాజు, చిన్న అప్పారావు, మరిడయ్య, బి.అప్పారావు, తదితరులు ఉన్నారు.

శరవేగంగా ఆధునికీకరణ పనులు

» ఏడాదిలో మారనున్న సింహాచలం

రైల్వేస్టేషన్ రూపురేఖలు

గోపాలపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రాముఖ్యత గల సింహాచలం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫారాలున్నాయి. 25 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ లేక పోవడంతో సింహాచలం వచ్చే భక్తులు నగరంలోని ప్రధాన స్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో స్టేషన్‌ను ఆధునికీకరించడానికి అమృత్ భారత్‌లో భాగంగా రూ.19.5 కోట్లు మంజూరు చేశారు. ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించారు.

అధునాతన సౌకర్యాలు

సింహాచలం రైల్వేస్టేషన్ పదేళ్లలో అభివృద్ధిచెందింది. ప్లాట్‌ఫారాల విస్తరణ, ప్రాంగణ ఆధునికీకరణ పనులు చేపట్టారు. అమృత్ భారత్‌లో భాగంగా రూపురేఖలు మారిపోనున్నాయి. ప్రస్తుత రెండు ప్లాట్ ఫారాలతో పాటు అదనంగా మరో రెండు లైన్లు, ప్లాట్‌ఫారాల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుత భవనాన్ని తొలగించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ గోపురం నమూనాతో కొత్త భవనం నిర్మించనున్నారు. స్టేషన్ ఎదురుగా రహదారి ఇరుగ్గా ఉండడంతో రైళ్లు వచ్చిపోయే సమయంలో ప్రయాణీకుల రద్దీగా కారణంగా స్టేషన్ బయట వాహనాలు స్తంభించి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రధాన రహదారికి చేరుకోడానికి సదరం అప్పలనాయుడు మార్గంలోకి వాహనాలు వెళ్లేలా నిర్మాణం చేపట్టనున్నారు. ప్రయాణికులకు వీలుగా మరో ఫుట్‌ఓవర్ వంతెన నిర్మించనున్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. భవనం, ఫుట్‌ఓవర్ నిర్మాణం పనులు ఏడాదిలో పూర్తవుతాయని, దీంతో స్టేషన్ రూపురేఖలు మారుతాయంటున్నారు. దీనివల్ల అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యం కలగనుంది.


నిర్మాణంలో ఉన్న స్టేషన్ భవనం


రూపుదిద్దుకుంటున్న ఫుట్‌ఓవర్ వంతెన

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


త్రినాథపురంలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మల్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద జీవీఎంసీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం వీధి నాటకం ప్రదర్శించారు. భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో మలేరియా ఇన్స్‌పెక్టర్ రవికుమార్ కుమారి, చందు, రాణి, సముద్రం పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో మలేరియా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాజాత నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రదర్శన నిర్వహించిన భద్రం ఫౌండేషన్ కళాకారులను అభినందించారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుమారుడుని స్కూల్‌కు తీసుకువెళ్లిన తన భార్య తిరిగి ఇంటికి చేరుకోలేదంటూ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు భర్త సోమవారం ఫిర్యాదు చేశారు. సెక్టార్-1లోని 45-ఏ క్వార్టర్స్‌లో చిత్రసేన్ తారయ్ తన భార్య అనిత తారయ్ (32) కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తి మూలంగా భార్యాభర్తల మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన తన భార్య తిరిగి ఇంటికి చేరుకోలేదని చిత్రసేన్ తారయ్ ఫిర్యాదు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలక్షణ రచయిత సోమసుందర్

పెదగంట్యాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అవంత్స సోమసుందర్ విలక్షణ రచయిత, నాటకకర్త, విమర్శకులని గంగవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పైడి హేమలత అన్నారు. నటాలి నాటక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వినాయకనగర్ లో నిర్వహించిన సోమసుందర్ శత జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సోమసుందర్ రాసిన వజ్రాయుధం కవితా సంపుటి ఆయనకు గొప్పపేరు తెచ్చిందన్నారు. నటాలి సంస్థ వ్యవస్థాపకులు కొత్తపల్లి బంగార్రాజు మాట్లాడుతూ సోమసుందర్ రచనలకు తెలుగు యూనివర్సిటీ ప్రతిభా పురస్కారంతో గౌరవించిందన్నారు. నటాలి సభ్యులు ఎ.కొండలరావు, వి.సత్యనారాయణ, భీమసాహు, పి.లోకేశ్వరరావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గ్రంథాలయ వారోత్సవాలు

పెందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. దీనిని కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ పుస్తర పఠనంతో విజ్ఞానం లభిస్తుందన్నారు. సోషల్ మీడియా విజృంభిస్తున్న తరుణంలో మంచి పుస్తకం చదవడం మానసిక వికాసానికి శ్రేయస్కరమన్నారు. ఈ సందర్భంగా పుస్తక విరాళ దాత బలివాడ కృష్ణప్రియను సత్కరించారు. అనంతరం విద్యార్థులు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.


పెందుర్తిలో పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న కార్పొరేటర్

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గోపాలపట్నం: పిల్లలకు కథలు చెప్పడం వలన వారిలోని జ్ఞాపకశక్తి పెరుగుతుందని గోపాలపట్నం శాఖా గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం అన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, కథల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.రఘుపాత్రుడు, బి.కవిత, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గోపాలపట్నంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గాజువాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక లైబ్రరీలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.విజయ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చదువుపై దృష్టి సారించడంతో పాటు ఇతర రంగాల్లోనూ ప్రావీణ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, నడుపూరు హైస్కూల్ జట్టు ప్రథమ స్థానంలో, లైఫ్‌వే స్కూల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ పీవీ రమణ తెలిపారు.

'బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి'

కూర్మన్నపాలెం,నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. 86వ వార్డు భరత్ నగర్‌లో సోమవారం బీజేపీ జిల్లా కార్యదర్శి బొండా శ్రీదేవి, ఎల్లాజీరావు ఆధ్వర్యంలో, 87వ వార్డు వడ్లపూడిలో కో-కన్వీనర్ లక్కరాజు సోంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కరణంరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో 'గాజువాక' జిల్లాలో రెండు, రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, సురేశ్, సంజీవరావు, అప్పారావు, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

25లోగా బూత్ కమిటీల నియామకాలు చేపట్టాలి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో బీజేపీని తొమ్మిది మండలాలుగా విభజించామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరసపల్లి నూకరాజు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి రాజ్యాంగం ప్రకారం ఒక రిటర్నింగ్ అధికారిని నియమించామన్నారు. పోలింగ్ బూత్ కమిటీలను ఈ నెల 25లోగా నియమించాలన్నారు. సమావేశంలో నాయకులు కరణంరెడ్డి నరసింగరావు,నాగేశ్వరరావు, భువనేశ్వరి, అనిత, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన లేకుండా కమిషన్ వేయడం సరికాదు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన ఏకసభ్య కమిషన్‌ను వ్యతిరేకిస్తూ ఉక్కు టౌన్‌షిప్‌లో సోమవారం మాలల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు ఫౌండర్ కేబీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ 59 ఉప కులాల ఇంపీరికల్ డేటా, కులగణన లేకుండా గౌరవ సుప్రీంకోర్టు కమిషన్ ఎలా వేస్తుందని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ నాయకుడు బయ్యే మల్లయ్య మాట్లాడుతూ శాస్త్రీయమైన సర్వే చేసి అందరి ఆమోదంతో ఎస్సీల్లో ఉన్న ఉప కులాల వారీగా వెనకబాటుతనాన్ని గుర్తించాలన్నారు. అనంతరం మాలల గర్జన పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పి.రాంబాబు, బి.వెంకటరావు, డి.సురేశ్ బాబు, ఎల్‌వీ రమణ, రామకృష్ణ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ గవర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనీలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య గౌరీపరమేశ్వరులను ఘనంగా ఊరేగించారు.

శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు

పెందుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివాలయా లు భక్తులతో కిటకిటలాడాయి. సరిపల్లి స్వయంభు శివాలయంలో భక్తులు 108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. పినగాడి చోడేశ్వర శివాలయం, పెందుర్తి, ప్రశాంతినగర్, చినముషిడివాడ శ్రమశక్తినగర్, రత్నగిరి నగర్ ఆలయాల్లో పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపారాధన చేశారు.

వేపగుంట: జీవీఎంసీ 93, 94వ వార్డు శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు జరిగాయి. కృష్ణానగర్ గుడివీధి దుర్గా మల్లేశ్వరాలయం, రవినగర్ ఉమాశంకర్ ఆలయం, వేపగుంట కొండపైన శివాలయం, ముత్యాలమ్మ గుడి ఆవరణలోని శివాలయం, ప్రహ్లాదపురం శివాలయంలో శివునికి అభిషేకాలు, పూజలుచేశారు.

ఎస్.ఎ.డీ.జంక్షన్: స్థానిక గణేష్‌నగర్ ప్రమాద ఉమా విశ్వేశ్వర కుమారస్వామి దేవస్థానం, లక్ష్మీనగర్ ఉమాశంకర గణపతి, సుసర్లకాలనీ పార్వతీ చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్ శివాలయాల్లో అభిషేకాలు అర్చనలు జరిగాయి.


సరిపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సందడిగా కార్తీక వన సమారాధన

పెందుర్తిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పలుచోట్ల కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. వేపగుంట, పినగాడి మార్గంలో జరిగిన కార్యక్రమంలో పది గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. రావి, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. చీమలాపల్లి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది.

'హక్కుల కోసం యువత ఉద్యమించాలి'

మల్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హక్కుల రక్షణకు యువత ఉద్యమించాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడారు. మన రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్, 12 షెడ్యూల్స్ ఉన్నాయని, 5, 6 షెడ్యూల్స్ ప్రత్యేకంగా గిరిజనల కోసం కేటాయించారన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి రాజ్యాంగ పరిషత్, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, సత్తిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి: సీపీఐ

సింధియా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతలలోవ గ్రామ సచివాలయాలను సోమవారం లబ్ధిదారులు ముట్టడించారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాంద్రేంగుల సత్యాంజనేయ మాట్లాడుతూ గ్రామాల్లో రెండుసెంట్లు భూమి, పట్టణాల్లో మూడు సెంట్లు భూమి ఇవ్వాలని, అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. నేతలు గుడాల రాంబాబు, జయ, లక్ష్మి, త్రినాథ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 వినతులు

వేపగుంట నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు 14 వినతులు అందాయి. సుసర్ల కాలనీలో అక్రమనిర్మాణం నిలుపుదల చేయాలని, నరసింహనగర్‌లో యూజీడీ సమస్య పరిష్కరించాలని, చినముషిడివాడ , శాంతి థియేటర్ పరిసరాల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ

వేపగుంట నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి అయ్యప్ప అంబలం పూజ వైభవంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండిబాబ్జి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం 1500 మంది మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, గనిశెట్టి సూరిబాబు, నవీన్, ఆనంద్, అర్చకుడు శేషాద్రి శర్మ తదితరులు పాల్గొన్నారు.


అంబలం పూజలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు తదితరులు

సింహగిరి జలధారలపై అధ్యయనం



నాగధార నీటి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఉన్న జలధారలపై వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో అధ్యయనం జరుగుతోంది. ఈమేరకు ధన్ ఫౌండేషన్‌కు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎస్.లోకేశ్‌తో కూడిన బృందం సోమవారం కొండపై పర్యటించింది. భక్తులు స్నానాలు ఆచరించే గంగధార, స్వామివారి ప్రసాదాల తయారీకి వినియోగించే అనంత(నాగ) ధార, మెట్లమార్గంలోని వేగవతి(చాకి)ధారల నుంచి నీటి నమూనాలను సేకరించారు. మార్కెట్‌లో లభిస్తున్న మినరల్ వాటర్ కంటే నాణ్యతతో ఈ నీరుందన్నారు. గంగధార నుంచి సెకెనుకు లీటరు, వేగవతి ధార నుంచి ఎనిమిది సెకండ్లకు లీటరు వస్తోందని గుర్తించామన్నారు. భవిష్యత్తు అవసరాలకు జలధార నీటిని ఒడిసిపట్టేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఈనెల 23న నిపుణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈఈ బండారు రాంబాబు, డీఈఈ రామరాజు (హరి), ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్, ధన్ ఫౌండేషన్ సిబ్బంది వరప్రసాద్, సతీశ్ ఉన్నారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల నేపథ్యంలో పలు రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 19, 23, 25, 30న ధనబాద్-అలెప్పీ బొకారో 21, 28న టాటా-యశ్వంత్‌పూర్, ఈ నెల 20, 27న జసిదిహ్-తంబరం, 25న హటియా-ఎర్నాకులం, 23, 30న హటియా-ఎస్ఎంవీ బెంగళూరు, 19, 26న హటియా-బెంగళూరు, 22, 29న టాటానగర్-బెంగళూరు, 28న విశాఖ-సాయినగర్, 29న విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి రైళ్లు నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

మగ మహారాజులు

పురుషులకూ ఓ రోజుంది!



వారి గొంతు వినిపించుకునే వేదిక

- సాధించిన ఘనకార్యాలు చెప్పుకోవచ్చు
- ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో నిర్వహణ
- 1990 నుంచి ప్రారంభమైన ఆనవాయితీ
- నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):

జీవితం ఓ ప్రయాణం... అది సాఫీగా సాగాలంటే ఒడిదుడుకులు లేని జీవనం అవసరం... కుటుంబ వ్యవస్థలో దంపతులు జోడుగుర్రాల వంటివారు. జీవనయానంలో ఇద్దరి పాత్ర అనన్య సామాన్యమే అయినా కొన్ని సందర్భాల్లో పురుషుల ప్రాధాన్యం కాదనలేని వాస్తవం. 'ఇంటిని తీర్చిదిద్దేది ఇల్లాలే అయినా సమాజాన్ని జయించాల్సింది పురుషుడే' అన్నది కొందరి వాదన. 'బిడ్డ జీవితాన్ని ప్రారంభించేందుకు పెంపకం ద్వారా ప్రతి తండ్రి సాయపడతాడు.. అంతకంటే ముఖ్యంగా అతన్ని సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాడు'... అంటారు వీరు. పురుషాధిక్య సమాజం అంటూ మహిళలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వాలు తమ పట్ల వివక్ష చూపుతున్నాయని కొందరి మగాళ్ల వాదన. అదే రక్షణకు మేమెందుకు అర్హులం కాదన్నదే 'పురుషుల ప్రశ్న'. సమున్నత ఆశయంతో ప్రభుత్వం కల్పించిన చట్టపరమైన రక్షణ కొందరు మహిళల తీరు వల్ల పురుషులకు శాపంగా మారుతోందని, ఈ పరిస్థితుల్లో మాకూ రక్షణ కావాలన్నది పురుష సమాజం డిమాండ్. అలాంటి డిమాండ్ నుంచి ఉద్భవించిందే పురుషుల దినోత్సవం.

పితృస్వామ్య వ్యవస్థలో పురుషునిదే ఆధిపత్యం. అయినా ఇది నూరుశాతం నిజం కాదు. అక్కడక్కడా మహిళల వేధింపులు, వివక్షకు గురవుతున్న పురుషులున్నారు. 'భార్యాభర్తల సంఘం' ఏర్పడడానికి ఈ వివక్షే కారణం. కుటుంబంలో తమ మాట చెల్లుబాటు కావడం లేదని, భార్య ఆధిపత్యమే కొనసాగుతోందని, వేధింపులకు గురవుతున్నామని ఈ సంఘం సభ్యులు చెబుతుంటారు. ఇటువంటి సందర్భాలే ప్రత్యేకంగా పురుషుల దినోత్సవం నిర్వహించేందుకు కారణమయ్యాయి.

ఎలా ఏర్పడింది?


అనాదిగా పురుషులు సమాజానికి 'రోల్‌మోడల్స్' అన్న అభిప్రాయం ఉంది. దీనికి ప్రత్యక్ష కార్యాచరణ 'పురుషుల దినోత్సవం' అంటారు. తొలుత థామస్ హాస్టర్ మదిలో ఈ ఆలోచన వచ్చింది. ఎన్నో ప్రత్యేక దినోత్సవాలు నిర్వహిస్తుండగా పురుషుల కోసం ఎందుకు ఓ రోజు ఉండకూడదని భావించాడు. 1989లో ఫుట్‌బాల్ ఆటకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చింది. అదే ఏడాది నవంబరు 19న తన తండ్రి పుట్టినరోజు రావడంతో ఆ రోజున 'పురుషుల దినోత్సవం' నిర్వహించాలని ప్రతిపాదించాడు. అంతవరకు ఇటువంటి ఆలోచన ఎవరికీ రానందున చాలామంది దీనిని అంగీకరించారు ఐక్యరాజ్య సమితి వద్దకు ఈ ప్రతిపాదన వెళ్లగానే వారు కూడా నవంబరు 19న 'అంతర్జాతీయ పురుషుల దినోత్సవం' నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. ఈ దినోత్సవాన్ని 1982 వరకు నామమాత్రంగా నిర్వహించినా ఆ తర్వాత విస్తృత ప్రాచుర్యం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 80 దేశాల్లో ఈ రోజున పురుషులు సాధించిన విజయాలపై ప్రచారం చేయడానికి ప్రత్యేక తరహా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

పురుష దినోత్సవ లక్ష్యాలివీ...

పురుషులకు సమాజంలో ప్రత్యేకత ఉంది. కానీ చాలా దేశాల్లో స్త్రీపురుషుల మధ్య సమానత్వం లేదట. పురుషులు వివక్షకు గురవుతున్నారన్నది ఓ భావన.

పురుషులు కూడా స్త్రీలతో సమానమేనని, ఆర్థిక సామాజిక సేవా గుణాలతో పాటు శారీరక బలంలో సమానమేనని ప్రచారం చేయడం కోసం దినోత్సవాన్ని వినియోగించాలన్నది మరో ఉద్దేశం.

స్త్రీ, పురుషుల మధ్య విభేదాలు, అభిప్రాయ భేదాలు లేకుండా ఉండాలని, ఇద్దరూ వేర్వేరు అనే భావన లేకుండా చేయడానికి దీనిని ఉపయోగించుకోవాలన్నది లక్ష్యం.



పురుషుల ఆరోగ్య అంశాల అభివృద్ధికి, ఇతరత్రా అంశాల పరిరరక్షణకు, వారి అభ్యున్నతికి కృషి చేయడానికి దినోత్సవం అవసరమని భావించారు.

సమాజ గతిని మార్చే శక్తి పురుషులకు మాత్రమే ఉందని నిరూపించడానికి వీలు. సమాజంలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పురుషుల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలియజేయడానికి దీనిని వేదికగా మార్చుకుంటున్నారు.

పురుషుడి విలువ, బాధ్యత కుటుంబానికి, సమాజానికి అవసరమని తెలియజేయడం.

సమాజంలో మానవతా విలువల్ని పెంపొందించడానికి పురుషుల ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడానికి, వారి ప్రత్యేకతను నిలబెట్టడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

దేశంలో పురుష సంఘాలు

మన దేశంలో ఏ సంఘం ఏర్పాటైనా కార్యవర్గంలో కొందరు స్త్రీలు ఉండాలన్న నిబంధన ఉంది. కానీ మహిళా సంఘాలకు ఈ నిబంధన వర్తించదు. అందుకే కేవలం పురుషులు మాత్రమే ఉన్న సంఘాలు ఏర్పాటు కావాలన్న డిమాండ్ మొదలయింది. మొట్టమొదటి సంఘం 1989లో పుణేలో ఏర్పాటైంది. ఈ సంఘం ప్రత్యేకంగా సమావేశమై పురుషులకు జరిగిన అన్యాయాలపై చర్చిస్తుంది. ఈ సంఘంతోపాటు భార్యాబాధితుల సంఘం కూడా కొన్ని రాష్ట్రాల్లో పనిచేస్తోంది. కుటుంబ పరంగా ఇబ్బంది ఎదురైన వారంతా కలిసికట్టుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. రానున్న కాలంలో మరిన్ని పురుషుల సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

ప్రతి ఏటా సరికొత్త నినాదం

అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా ఏటా ఓ సరికొత్త నినాదం సమాజం ముందుకు వస్తోంది. 2002 నుంచి దీనిని అమల్లోకి తెచ్చారు. 2002లో శాంతి సమాజం, 2003లో పురుషుల ఆరోగ్యం, 2007లో స్వస్థత, క్షమాగుణం, 2008లో గౌరవం, త్యాగం, 2009లో ఆదర్శ, స్ఫూర్తిదాయక పురుషులు, 2010 మన సంతానం, భవిష్యత్తు, 2011 మగపిల్లలకు ఉత్తమ జీవన ఆరంభాన్ని అలవాటు చేయడం, 2012లో సంతోషదాయక, ఆరోగ్య జీవితాన్ని గడిపేందుకు పురుషులకు సహాయ పడడం, 2013లో పురుషులు, మగపిల్లల సంరక్షణ, 2014లో పురుషులు, మగపిల్లల కోసం సమష్టిగా పనిచేయడం, 2015లో పురుషుల పునరుత్పత్తిని పెంచడా నికి కృషి, 2016లో పురుషుల ఆత్మహత్యలు ఆపండి, 2017లో పురుషుల్లో వైవిధ్య ధోరణి, 2018లో పురుషుల శ్రేయస్సు, 2019లో సానుకూల మోడల్‌ను హైలెట్ చేయడం, 2020లో సంపూర్ణ పురుషుల ఆరోగ్యం, 2021లో స్త్రీ, పురుషుల మధ్య సరైన అవగాహన, 2022లో బాలలు, పురుషులకు సహాయపడడం, 2023లో పురుషుల ఆత్మహత్యల నివారణ, ఈ ఏడాది సానుకూల రోల్ మోడల్‌గా గుర్తింపు అనే నినాదాలతో జరుపుకుంటున్నారు.

రైతులకు మేలు చేకూరేలా పనిచేయాలి

- దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో ఉన్నతాధికారులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోని రైతులకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్నాయని, వీటిని రైతుల చెంతకు చేరేలా చూడాల్సిన బాధ్యత ఈశాఖపై ఉందని అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో నూతన ఆవిష్కరణలు, సంస్కరణలు, ప్రాజెక్టులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు రాడిసన్ బ్లూ హోటల్‌లో సోమవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ దేవేశ్ చతుర్వేది మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో పథకాలు అమలుచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పేరిన్ దేవి, కేంద్ర రైతు సంక్షేమ, వ్యవసాయ పథకాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుల జీవన విధానాల్లో మార్పులు తీసుకువచ్చేందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. ఈ సదస్సుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ అడిషినల్ సెక్రటరీ సుభా థాకూర్, అదనపు కార్యదర్శి డాక్టర్ ప్రమోద్‌కుమార్ మెహర్దా, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, వ్యవసాయశాఖ అధికారులు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళ నాడు, కేరళ రాష్ట్రాలు, పుదుచ్చేరి నుంచి వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు హాజరయ్యారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచన



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

మహారాణిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 328 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 149, జీవీఎంసీ 53, పోలీసు 19, ఇతర శాఖలవి 107 అర్జీలు ఉన్నట్లు తెలిపారు. గత వారం వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల విషయంలో అధికారులు మరింత శ్రద్ధ చూపి నిర్ణీత సమయంలోగా నాణ్యమైన శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నవంబరు 19 నుంచి డిసెంబరు 10 వరకు నిర్వహించే ప్రపంచ మరుగుదొడ్ల నిర్వహణ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సమాచారం నమోదు చేయడానికి వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రూపొందించిన హెల్త్ కార్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, ఆర్‌డీవో శ్రీలేఖ, జడ్పీ సీఈవో నారాయణమూర్తి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి 106 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 106 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి ఆమె సోమవారం కార్యక్రమం నిర్వహించారు. అందిన వినతులకు మూడు రోజుల్లో పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు.

పోలీసు కమిషనరేట్‌లో 91 ఫిర్యాదులు

మహారాణిపేట: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 91 ఫిర్యాదులు స్వీకరించినట్లు పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం ఆయన అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించి చట్ట పరిధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేషనల్ హెల్త్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో పనిచేస్తున్న వైద్యులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్)పై సోమవారం ఆరోగ్యశాఖ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు నోడల్ అధికారి రమాదేవి, క్వాలిటీ కన్సల్టెంట్ సురేష్ పల్లా, డాక్టర్ రవీంద్ర హాజరయ్యారు. ఆస్పత్రుల్లో క్వాలిటీ స్టాండర్డ్స్ పాటించే విధానం వివరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్‌ను పాటించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఎంవో డాక్టర్ బి.ఉమావతి, సిబ్బంది, వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొన్నారు.

జీసీసీ చైర్మన్‌గా కిడారి బాధ్యతల స్వీకరణ



కిడారిని అభినందిస్తున్న గిడ్డి ఈశ్వరి, తాతయ్యబాబు, తదితరులు

గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్‌గా మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం నగరంలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గిడ్డిఈశ్వరి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



తరుణ్ (ఫైల్ ఫొటో)

మల్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మల్కాపురం జాలారివీధిలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న మోదు తరుణ్ (23) కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. సోమవారం విధులకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చీరతో ఉరివేసుకున్నాడు. ఆరు నెలల క్రితం తరుణ్ అన్నయ్య హెచ్‌టీ విద్యుత్ తీగలను పట్టుకొని ఆత్మహత్య చేసుకోగా, గతంలో వారి తల్లి కూడా ఉరివేసుకుని మృతి చెందారు. మానసికంగా ఇబ్బంది పడుతుండడంతో వీరంతా ఆత్మహత్యలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యురాలిపై రోగి బంధువుల దాడి

గోపాలపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకువచ్చిన గర్భిణి బంధువులు వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెపై దాడిచేశారు. ఈ సంఘటన ఈనెల 15న జరిగింది. బాధిత వైద్యురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గోపాలపట్నం సీహెచ్‌సీకి ఈ నెల 15న రాత్రి గర్భిణిని తీసుకువచ్చారు. ఆమెతో పాటు మహిళలు, పురుషులు వచ్చారు. ఆసక్రాత్రిలో పురుషులు ఉండేందుకు వీలులేదని, వెళ్లిపోవాలని విధుల్లోని వైద్యురాలు చెప్పారు. అయితే వారికి రాజకీయ పలుకుబడి ఉండడంతో తెల్లవారు జామువరకూ ఆస్పత్రిలోనే ఉండి వైద్యురాలి విధులకు ఆటంకం కలిగించారు. కొందరు ఆమెపై దాడి చేశారు. దీంతో ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారి సూచనల మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ సతీశ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ కోచ్‌లు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ మీదుగా భువనేశ్వర్-బెంగళూరు మధ్య ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి రైళ్ల సర్వీసులకు తాత్కాలికంగా అదనపు ఏసీ కోచ్‌లు జతచేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 23 నుంచి డిసెంబరు 1 వరకు రెండు అదనపు థర్డ్ ఏసీ కోచ్‌లు, భువనేశ్వర్-తిరుపతిఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 24 నుంచి డిసెంబరు 1 వరకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ జైలు శిక్ష

డాబాగార్డెన్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమని అడిగిన స్నేహితుడ్ని హతమార్చిన ముద్దాయికి జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గాయత్రీదేవి సోమవారం తీర్పునిచ్చారు. హతుని కుటుంబానికి రూ.6 లక్షల జరిమానా చెల్లించాలని, లేకుంటే అదనంగా మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. వై.పవన్‌కుమార్ (37) గాజువాకలో శ్రీహరిపురం టాక్సీ సర్వీసెస్, ఇంటర్నెట్ సేవలందిస్తూ మురళీనగర్ సమీప అయ్యప్పనగర్‌లో ఉంటున్నాడు. హతుడు శంకర్ శ్రీనివాస్ మురళీనగర్‌లో ఫైనాన్స్ వ్యాపారి. ఇద్దరి మధ్య స్నేహం కుదరడంతో పవన్‌కుమార్ 2014 మేలో రూ.75 వేలు అప్పు తీసుకున్నాడు. మూడు నెలల్లో తీరుస్తానని ఇవ్వలేదు. దీంతో శ్రీనివాస్ డబ్బు కోసం డిమాండ్ చేశాడు. దీంతో 2014 మే 27న రాత్రి 10 గంటల సమయంలో డబ్బులిస్తానని పిలిచాడు. నీళ్ల సీసా నిండా పెట్రోల్ నింపి శ్రీనివాస్‌పై పోసి నిప్పంటించాడు. శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జ్ఞానాపురం రైల్వేస్టేషన్ వెనుకభాగంలో వదిలి పారిపోయాడు. కంచరపాలెం ఎస్ఐ కేవీ సురేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.